# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 322, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం - 03 - ఫిబ్రవరి - 2025


## రాష్ట్రపతిపై అనుచిత వ్యాఖ్యలు.. సోనియా గాంధీపై కేసు నమోదు




పట్నా: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మరోమారు చిక్కుల్లో పడ్డారు. ఆమె రాష్ట్రపతి ద్రౌపది ముర్మును 'పేద మహిళ' అని అభివర్ణించినందుకు బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఆమెపై పోలీసు కేసు నమోదైంది. సుధీర్ ఓజా అనే న్యాయవాది సీజేఎం కోర్టులో ఈ ఫిర్యాదు దాఖలు చేశారు. దీనిని కోర్టు స్వీకరించగా, ఈ కేసు ఫిబ్రవరి 10న విచారణకు రానుంది.

## ఆప్,కాంగ్రెస్‌లపై ప్రధాని ఫైర్




న్యూఢిల్లీ:బీజేపీ అధికారంలోకి వస్తే ఒక్క మురికివాడను కూడా తొలగించబోమని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. మురికివాడల్లో కూల్చివేతల విషయంలో ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత కేజ్రీవాల్ తమపై చేస్తున్న ఆరోపణలన్నీ అబద్ధమన్నారు. ఆదివారం(ఫిబ్రవరి2) ఢిల్లీ ఆర్కేపురం ప్రాంతంలో జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని ఆప్,కాంగ్రెస్

## ట్రంప్‌కు ఎదురుదెబ్బ.. బెడిసికొట్టిన ప్లాన్!




వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. కెనడా, మెక్సికోపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాలు విధించడంపై ఆయా దేశాలు మండిపడుతున్నాయి. ట్రంప్ తప్పుడు పద్ధతుల్లో వెళ్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇదే సమయంలో, అమెరికాపై ప్రతీకార చర్యలు తీసుకునేందుకు కెనడా, మెక్సికో దేశాలు సిద్ధమయ్యాయి. అలాగే, ట్రంప్ నిర్ణయాన్ని డబ్ల్యూటీవో సవాల్ చేస్తానని చైనా హెచ్చరించింది. డొనాల్డ్ ట్రంప్..

## భువనేశ్వరి, బాలయ్య మధ్య నలిగిపోతున్నాను...

బాలకృష్ణకు పద్మభూషణ్

తన ఫాంహౌస్ లో ఫ్యామిలీ పార్టీ ఏర్పాటు చేసిన నారా భువనేశ్వరి

హాజరైన చంద్రబాబు

ఆద్యంతం ఉల్లాసంగా కార్యక్రమం




**అమరావతి,:** నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మభూషణ్ ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన అన్నయ్య బాలకృష్ణ గౌరవార్థం సొంత ఫాంహౌస్ లో నారా భువనేశ్వరి గ్రాండ్ గా పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కుటుంబ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంకా, ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి, నారా, నందమూరి కుటుంబ సభ్యులు హాజరైన ఈ ఫ్యామిలీ పార్టీ ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. ముఖ్యంగా, చంద్రబాబు తన చమత్కారాలతో అందరినీ నవ్వించారు. నారా భువనేశ్వరి కూడా చంద్రబాబుతో కొన్ని సరదా వ్యాఖ్యలు చేయడం ఈ కార్యక్రమంలో నవ్వులు పూయించింది. నారా భువనేశ్వరి తన భర్త చంద్రబాబుకు వేదికపై మైక్ అందిస్తూ... ఏమండీ ఒకసారి ఇలా రండి... బాలా గురించి కొన్ని మాటాలు మాట్లాడండి... అయితే ఐదు నిమిషాల్లో స్పీచ్ అయిపోవాలి... ఇదేమీ రాజకీయ ప్రసంగం కాదు... గంటలు గంటలు మాట్లాడొద్దు అని అన్నారు. తన అర్ధాంగి మాటలకు నవ్వుతూనే మైక్ అందుకున్న చంద్రబాబు... అన్నాచెల్లెళ్లను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఇది నిజంగా అద్భుతమైన సాయంత్రం. ఒకవైపున బాలయ్య... మరోవైపు అంతే

## టీడీపీ ప్రయోజనాలు వేరు.. ఏపీ అవసరాలు వేరు




- బడ్జెట్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూసిన ఏపీ ప్రజలకు ఆత్మ ఘోష మిగిలింది
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని చంద్రబాబు ఎందుకు చెప్పలేక పోయారు

విశాఖపట్నం: రాష్ట్రంలో టీడీపీ ప్రయోజనాలు వేరు, రాష్ట్ర అవసరాలు వేరు అనేది స్పష్టమైందన్నారు

## వైఎస్ షర్మిలతో సీక్రెట్‌గా విజయసాయి రెడ్డి భేటీ..

## వైసీపీలో మొదలైన కంగారు!!




**అమరావతి,:** ఏపీ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల నుంచి తప్పుకొని వ్యవసాయం చేస్తానని ప్రకటించిన విజయసాయిరెడ్డి.. ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలతో మూడు రోజుల క్రితం సీక్రెట్‌గా సమావేశమైనట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో కులగణన సర్వే




- సామాజిక న్యాయం కోసమే ఈ సర్వే: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- మంత్రివర్గ ఉపసంఘానికి సర్వే నివేదిక సమర్పించిన ప్రణాళిక సంఘం

## అడిగిందేంటి ఇచ్చిందేంటి..

## కేంద్ర బడ్జెట్‌పై సీఎం రేవంత్, శ్రీధర్ బాబు

- పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీస్తామని సీఎం రేవంత్
- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం
- రాజకీయ కారణాలతో తెలంగాణపై చిన్నచూపు చూశారన్నారు మంత్రి శ్రీధర్ బాబు
- బీజేపీకి 8 ఎంపీలను ఇచ్చిన తెలంగాణ ప్రజలకు మోడీ ప్రభుత్వం ద్రోహం


### ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే పెద్ద పీట




హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిన కేటాయింపులపై మంత్రులు, ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.

## బీఆర్ఎస్,కాంగ్రెస్‌కు ఎంపీ లక్ష్మణ్ ఛాలెంజ్

హైదరాబాద్:వికసిత్ భారత్ 2047 విజన్ లక్ష్యంగానే కేంద్రం 2025-26




బడ్జెట్ ప్రవేశపెట్టిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం(ఫిబ్రవరి2) లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో మూడు ప్రపంచస్థాయి రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేశాం. ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రమే నిధులు ఇస్తోంది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వమే పునరుద్ధరించింది కరోనా లాంటి గడ్డు పరిస్థితి తర్వాత కఠిన నిర్ణయాలు తీసుకుని దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ గాడిలో పెట్టారు. 2014లో 2 లక్షలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటే ఇప్పుడు ఏకంగా 12 లక్షల వరకు మినహాయింపు ఇచ్చారు. ఇదొక మైల్ స్టోన్. దశాబ్ద కాలంలో మోదీ ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మధ్య తరగతి ప్రజలతో దేశ ఆర్థిక ప్రగతి సాధ్యమని భావించి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## ఢిల్లీకి చంద్రబాబు .. ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం




- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సీఎం చంద్రబాబు
- ఎన్డీఏ భాగస్వామిగా బీజేపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేయనున్న చంద్రబాబు
- తెలుగు వారు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చంద్రబాబు ఎన్నికల ప్రచారం

**అమరావతి,:**తెలుగుదేశంపార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

## భూమి దిశగా దూసుకువస్తున్న ఫుట్ బాల్ మైదానం కంటే పెద్ద ఆస్టరాయిడ్.. నాసా ఏం చెబుతోందంటే...!




భూమి వైపుకు దూసుకువస్తున్న 130 -300 అడుగుల పొడవు గల గ్రహశకలం

2024 డిసెంబర్ 27న నాసాకి చెందిన అస్టరాయిడ్ టెర్రెస్ట్రియల్ ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టం ఈ గ్రహ శకలాన్ని గుర్తించిన వైనం

ఈ గ్రహ శకలం భూమిని ఢీకొట్టే ఛాన్స్ ఒక్క శాతమేనని చెప్పిన నాసా శాస్త్రవేత్తలు

**న్యూఢిల్లీ,:** భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలాలు ఎప్పటికప్పుడు

## అక్కడ కేసీఆర్ ఇక్కడ జగన్...

### ఒకే ముహూర్తాన !?

**అమరావతి,:** తన దూకుడు మామూలుగా ఉండదని రెడ్ సిగ్నల్ ఇచ్చేశారు. గంభీరంగా చూస్తున్నాను అంతా గమనిస్తున్నాను ఫార్మ్ హౌస్ నుంచే అన్నీ ఆలోచిస్తున్నాను ఈ మాటలు అన్నది ఎవరో కాదు బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్. ఆయన ఏడాది పాటు సాగిన కాంగ్రెస్ పాలన మీద తనదైన శైలిలో చేసిన కామెంట్స్. తాను కనుక బలంగా కొడితే తట్టుకోలేరు అని కూడా అన్నారు. తన దూకుడు మామూలుగా ఉండదని రెడ్ సిగ్నల్ ఇచ్చేశారు. తాను ఈ నెల చివరి వారంలో జనంలోకి రాబోతున్నట్లుగా కూడా ఆయన చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఏమీ జరగలేదని కేసీఆర్ నిప్పులు చెరిగారు. మంచి ప్రభుత్వాన్ని దించేసిన జనాలూ ఆలోచిస్తున్నారు అన్నారు. ప్రజలలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందని అన్నారు. ఇలా కేసీఆర్ తన జనం బాట కార్యక్రమానికి అవసరమైన పూర్వ రంగం సిద్ధం చేసుకున్నట్లుగానే ఉన్నారు. జగన్ విషయం తీసుకుంటే గడచిన ఎనిమిది నెలలుగా ఆయన కూడా పెద్దగా జనంలో లేరు. అరకొరగా పార్టీ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఆయన ఇప్పటికి రెండు కార్యక్రమాల మీద నిరసనలకు పిలుపు ఇచ్చారు. అవన్నీ చప్ప చప్పగా సాగాయి. దానికి కారణం క్యాడర్ ని పంపించి జగన్ తాను పాల్గొనకుండా తెర వెనక ఉండిపోయారు. ఇపుడు అయిదవ తేదీన




ఫీజులకు సంబంధించి రీ అంబర్స్ మెంట్ ని చెల్లించాలి అంటూ పోరాటం చేస్తున్నారు. ఇక జగన్ కూడా మంచి ముహూర్తంగా మాఘమాసాన్నే ఎంచుకున్నారు. అంటే ఫిబ్రవరి నెలలోనే.

# రాష్ట్రపతిపై అనుచిత వ్యాఖ్యలు.. సోనియా గాంధీపై కేసు నమోదు

## మొదటి పేజీ తరువాయి

దీనిని కోర్టు స్వీకరించగా, ఈ కేసు ఫిబ్రవరి 10న విచారణకు రానుంది. ఈ కేసులో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాలను కూడా సహ నిందితులుగా పిటిషనర్ పేర్కొన్నారు. వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోనియా గాంధీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అవమానించడానికి ప్రయత్నించారని పిటిషనర్ సుధీర్ పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సోనియా గాంధీ రాష్ట్రపతిపై చేసిన వ్యాఖ్య చాలా అభ్యంతరకరంగా ఉంది. రాష్ట్రపతి ఒక మహిళ అని, గిరిజన సమాజం నుండి వచ్చారని, ఆమెపై ఈ వ్యాఖ్య అభ్యంతరకరమని ఓజా పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం తర్వాత సోనియా గాంధీ పాత్రికేయులతో మాట్లాడుతూ 'చివరికి ఆ పేద మహిళ అలసిపోయింది' అని అన్నారు. అదే సమయంలో రాహుల్ గాంధీ రాష్ట్రపతి ప్రసంగాన్ని బోరింగ్‌గా అభివర్ణించారు. కాగా సోనియా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. సోనియా వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఇది దురదృష్టకర, అవమానకర వ్యాఖ్య అని రాష్ట్రపతి భవన్ పేర్కొంది. సోనియా గాంధీ వ్యాఖ్యపై ప్రధాని మోదీ మాట్లాడుతూ నేడు దేశం మరోసారి కాంగ్రెస్ రాజకుటుంబ అహంకారాన్ని చవిచూసిందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధి చెందిన భారతదేశం సాధించిన విజయాలు, దార్శనికత గురించి ఆమె దేశ ప్రజలకు తెలియజేశారు. హిందీ ఆమె మాతృభాష కాదు, అయినప్పటికీ ఆమె చాలా చక్కగా మాట్లాడారు. కానీ కాంగ్రెస్ రాజకుటుంబం ఆమెను అవమానించడం ప్రారంభించింది. ఇది దేశంలోని గిరిజన సోదరసోదరీమణులకు అవమానకరం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఆప్,కాంగ్రెస్‌లపై ప్రధాని ఫైర్

## మొదటి పేజీ తరువాయి

ఆదివారం(ఫిబ్రవరి2) ఢిల్లీ ఆర్కేపురం ప్రాంతంలో జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని ఆప్,కాంగ్రెస్ పార్టీలపై విమర్శలు గుప్పించారు. 'ఢిల్లీలో ఒక్క మురికివాడను కూడా తొలగించం. మేం మాటలు చెప్పే వాళ్లం కాదు మాటకు కట్టుబడే వాళ్లం. బడ్జెట్‌లో రూ.12 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయించి ఇది రుజువు చేశాం. మేం ప్రవేశపెట్టిన బడ్జెట్ మోస్ట్ ఫ్రెండ్లీ బడ్జెట్. ప్రస్తుతం ఢిల్లీ ప్రజలకు అందుతున్న ఏ సంక్షేమ పథకాన్ని కూడా మేం వచ్చాక ఆపబోము. బిహార్,పూర్వాంచల్ నుంచి ఢిల్లీకి వచ్చి జీవనం సాగిస్తున్న వారికి అండగా ఉంటాం.

# ట్రంప్‌కు ఎదురుదెబ్బ.. బెడిసికొట్టిన ప్లాన్!

## మొదటి పేజీ తరువాయి

అలాగే, ట్రంప్ నిర్ణయాన్ని డబ్ల్యూటీవో సవాల్ చేస్తానని చైనా హెచ్చరించింది. డొనాల్డ్ ట్రంప్.. కెనడా, మెక్సికో, చైనాపై సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్‌కు ఆ దేశాలు కౌంటరిస్తున్నారు. ఈ క్రమంలో కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రధాని జస్టిన్ ట్రూడో మాట్లాడుతూ.. '155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నాం. వాషింగ్టన్ చర్యలకు ఇది కె'నడా ప్రతిస్పందన. ఇందులో 30 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులపై విధించే సుంకం మంగళవారం నుంచి అమల్లోకి వస్తుంది. మిగిలినవి 21 రోజుల తర్వాత అమలవుతాయి. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని అధ్యక్షుడు ట్రంప్ అనుకుంటే.. మాతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలి. అదే వారికే మంచిది' అంటూ కామెంట్స్ చేశారు. మరోవైపు.. మెక్సికో కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. తాజాగా మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ మాట్లాడుతూ.. 'మెక్సికో పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుంది. మేము ఎప్పుడూ ఘర్షణలు కోరుకోము. డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో తమ ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాం. మా ప్రభుత్వం నాలుగు నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాం. పదివేల మందిని అరెస్టు చేశాం. మాదకద్రవ్యాలను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే.. అందుకు కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. టారిఫ్‌లు విధిస్తే సమస్యలు పరిష్కారం కావు. మెక్సికన్ల ప్రయోజనాలకు అనుగుణంగా మేము చర్యలు తీసుకుంటాం. ప్లాన్ బీని అమలు చేయాలనుకుంటున్నాం' అని తెలిపారు. ఇదిలా ఉండగా.. ట్రంప్ చర్యలపై చైనా కూడా మండిపడింది. తాజాగా చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. చైనా ప్రయోజనాలు, హక్కులను కాపాడుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. అమెరికా తప్పుడు పద్ధతులు అనుసరిస్తోంది. ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రపంచ వాణిజ్య సంస్థలో ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తాం. చర్యలతో అమెరికా సమస్యలు తీరకపోగా.. సాధారణ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్య సహకారాలు దెబ్బతింటాయి. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారి బెదిరించకుండా.. తన దేశంలో ఫెంటనిల్ వంటి సమస్యలను సొంతగా పరిష్కరించుకోవాలి. తప్పుడు పద్ధతులను సరిచేసుకోవాలని అమెరికాను కోరుతున్నాం అంటూ హితవు పలికింది.

# తెలంగాణలో కులగణన సర్వే

## మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, : తెలంగాణలో కులగణన, సమగ్ర కుటుంబ సర్వే చేపట్టడం తెలిసిందే. ప్రణాళిక సంఘం నేడు సర్వే నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందించింది. 3.54 కోట్ల మందిని సర్వే చేసి ఈ నివేదిక రూపొందించినట్టు ప్రణాళిక సంఘం అధికారులు తెలిపారు. 96.9 శాతం కుటుంబాలను సర్వే చేసినట్టు వివరించారు. 3.1 శాతం మంది సర్వేలో పాల్గొనలేదని వెల్లడించారు. బీసీ జనాభా 55.85 శాతం ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘానికి కులగణన సర్వే నివేదిక అందిందని వెల్లడించారు. దేశంలో ఎక్కడా ఇటువంటి సర్వే జరగలేదని చెప్పారు. ఇంత భారీ ప్రక్రియను సజావుగా, కచ్చితత్వంతో నిర్వహించినందుకు సీఎస్ శాంతికుమారి, ఇతర ఐఏఎస్ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు, సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. 50 రోజుల్లోనే సర్వే పూర్తి చేశామని, కులగణన సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెడతామని తెలిపారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకే సామాజిక, కులగణన సర్వే చేపట్టామని తెలిపారు. దేశంలో బీసీ జనాభా లెక్కించాలనేది రాహుల్ ఆశయమని అన్నారు. సామాజిక న్యాయం కోసమే ఈ సర్వే అని, వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్ష అని వెల్లడించారు.

# బీఆర్ఎస్,కాంగ్రెస్‌కు ఎంపీ లక్ష్మణ్ ఛాలెంజ్

## మొదటి పేజీ తరువాయి

ఇదొక మైల్ స్టోన్. దశాబ్ద కాలంలో మోదీ ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మధ్య తరగతి ప్రజలతో దేశ ఆర్థిక ప్రగతి సాధ్యమని భావించి మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాల హక్కులకు ప్రాధాన్యం కల్పిస్తూనే చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. సామాన్యుడు కూడా నాణ్యమైన విద్య, వైద్యం అందుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దారు ప్రతిపక్షపార్టీలు కళ్లు లేని కబోదులుగా మారి విమర్శలు చేస్తున్నాయి. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు కాంగ్రెస్‌కు కంచుకోటలాగా మెదక్‌ను చెప్పుకున్నారు.. కానీ అన్ని ఏండ్లు అధికారంలో ఉన్నా రైలు మార్గం వేయలేదు. కానీ మేము వేశాం. త్వరలో రైలు ప్రారంభమవుతుంది. ధర్నా చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్..మా హయాంలో పదేండ్లలో మేమేం చేశాం.. మీరేం చేశారు అనే అంశంపై చర్చకు సిద్ధమా?'అని లక్ష్మణ్ సవాల్ విసిరారు. కాగా శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు ఎప్పటిలాగే సున్నా నిధులు కేటాయించారని ఇటు కాంగ్రెస్ అటు బీఆర్ఎస్ విమర్శలు చేస్తున్నాయి. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి బీజేపీ తెలంగాణకు మొండి చెయ్యి చూపించిందని రెండు పార్టీలు ఆరోపిస్తున్నాయి.

# అడిగిందేంటి ఇచ్చిందేంటి.. కేంద్ర బడ్జెట్‌పై సీఎం రేవంత్, శ్రీధర్ బాబు



## మొదటి పేజీ తరువాయి

ఆర్థిక శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. శనివారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వారితో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రం పంపిన విజ్ఞప్తులు, కేంద్రం ఇచ్చిన నిధుల వ్యత్యాసంపై చర్చించారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని.. దీనిపై పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీస్తామన్నారు సీఎం రేవంత్. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకే పెద్ద పీట వేశారన్నారు. మిగిలిన రాష్ట్రాలను పూర్తిగా విస్మరించారన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ ఎంపీలతో చర్చించి.. పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీస్తామని సీఎం రేవంత్ చెప్పారు.

అడిగిందేదీ ఇవ్వలేదు: మంత్రి శ్రీధర్ బాబు

కేంద్ర బడ్జెట్?లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు మంత్రి శ్రీధర్ బాబు. బడ్జెట్ కేటాయింపులన్నీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు, ఎన్డీఏ భాగస్వామ్య రాష్ట్రాలకే దక్కాయన్నారు. కేంద్ర జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతం ఉన్నప్పటికీ ఆ మేరకు కూడా నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో రూ. 26 వేల కోట్లు కేంద్రానికి వెళ్లాయని తెలిపారు. గతంలో కంటే ఇది 12 శాతం మేర పెరిగినా.. రాజకీయ కారణాలతో తెలంగాణపై చిన్నచూపు చూశారన్నారు మంత్రి శ్రీధర్ బాబు. బీజేపీకి 8 ఎంపీలను ఇచ్చిన తెలంగాణ ప్రజలకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేసిందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలుమార్లు ప్రధాని మోడీ సహా కేంద్రమంత్రులను కలిసి సహాయం కోసం అభ్యర్థించారని చెప్పారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు విస్తరణకు కేంద్రం వాటాగా రూ. 17,212 కోట్లు కేటాయించాలని కోరినా.. రూపాయి కూడా ఇవ్వలేదని శ్రీధర్ బాబు కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివారు మున్సిపాలిటీలకు సీఎస్ఎంపీ కింద భూగర్భ డ్రైనేజీకి నిధులు కేటాయించాలని విన్నవించుకున్నా.. బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

# ఢిల్లీకి చంద్రబాబు .. ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం

**అమరావతి,:**తెలుగుదేశంపార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రోజు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లో తన నివాసం నుంచి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2.55 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం 5.50 గంటలకు 1 జన్ పథ్ నివాసానికి చేరుకుంటారు. రాత్రి 7 గంటలకు ఢిల్లీలోని సహద్ర ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఎన్డీయే భాగస్వామిగా ఆయన బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు. ఢిల్లీలో తెలుగువారు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో పర్యటించి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేయనున్నారు. మరోవైపు కూటమి ఎంపీలను ఢిల్లీలో తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రచారం చేయాలని చంద్రబాబు సూచించారు. ఇటీవల ఉండవల్లిలో జరిగిన ఎంపీల సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 5న జరగనుంది. ఓట్ల లెక్కింపును 8వ తేదీన నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు.

# భూమి దిశగా దూసుకువస్తున్న ఫుట్ బాల్ మైదానం కంటే పెద్ద ఆస్టరాయిడ్.. నాసా ఏం చెబుతోందంటే...!

**న్యూఢిల్లీ,:** భూమి వైపు దూసుకొస్తున్న గ్రహశకలాలు ఎప్పటికప్పుడు ప్రపంచాన్ని భయపెడుతూనే ఉన్నాయి. తాజాగా, అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) శాస్త్రవేత్తలు 2024 వైఆర్ 4 అనే గ్రహశకలాన్ని కనుగొన్నారు. ఇది 2032లో భూమిని ఢీకొనే అవకాశం ఉందని నాసా శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అబుదాబిలోని ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ సెంటర్ (ఐఏసీ) తెలిపిన వివరాల ప్రకారం.. ఈ భారీ గ్రహశకలం భూమివైపు దూసుకువస్తోందని, దీని పరిమాణం సుమారు ఫుట్‌బాల్ మైదానం కంటే పెద్దగా ఉంటుందని తెలిపారు. ఇది భూమి వైపు చాలా వేగంగా వస్తోందని, భూమిని ఢీకొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, 2032లో భూమిని ఢీకొట్టవచ్చని అంచనా వేశారు. 130 - 300 అడుగుల పొడవు గల ఈ గ్రహశకలం మానవాళి మొత్తానికి తక్కువ ప్రమాదకారి అయినా ఒక పెద్ద నగరాన్ని తీవ్రంగా నాశనం చేయగల శక్తిని కలిగి ఉండొచ్చని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీని ప్రభావం 8 మెగా టన్నుల టీఎన్‌టీకి సమానమని, ఇది హిరోషిమాపై ప్రయోగించిన అణుబాంబు కన్నా 500 రెట్లు శక్తివంతమైనది అయి ఉండవచ్చని వారు వెల్లడించారు. అయితే, 2032 డిసెంబర్ 22న ఈ గ్రహశకలం భూమిని ఢీకొట్టే అవకాశం ఒక్క శాతమేనని, అంటే 99 శాతం దాని ప్రభావం భూమిపై ఉండదని వారు తెలిపారు. కాగా, ఈ గ్రహశకలాన్ని 2024 డిసెంబర్ 27న నాసాకు చెందిన ఆస్టరాయిడ్ టెర్రెస్ట్రియల్ ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టమ్ కనిపెట్టింది.


# అక్కడ కేసీఆర్ ఇక్కడ జగన్...

## మొదటి పేజీ తరువాయి



ఇపుడు అయిదవ తేదీన ఫీజులకు సంబంధించి రీ అంబర్స్ మెంట్ ని చెల్లించాలి అంటూ పోరాటం చేస్తున్నారు. ఇక జగన్ కూడా మంచి ముహూర్తంగా మాఘమాసాన్నే ఎంచుకున్నారు. అంటే ఫిబ్రవరి నెలలోనే. ఆయన నిజానికి సంక్రాంతి పండుగకు రావాల్సి ఉంది. పండుగ కాగానే మూడవ వారంలో జనంలోకి వస్తాను అని అప్పట్లో ప్రకటించినా ఆయన లండన్ టూర్ పెట్టుకున్నారు. ఇపుడు ఆయన మళ్ళీ తిరిగి వచ్చారు కాబట్టి వైసీపీలో కొంత కదలిక కనిపిస్తోంది. ఈ నెల 3, 4 తేదీలలో జరిగే పార్టీ సమావేశాలలో జగన్ తాను జనంలోకి వచ్చే తేదీలను ప్రకటించవచ్చు. మొత్తానికి చూస్తూంటే అటు కేసీఆర్ కానీ ఇటు జగన్ కానీ అధికారంలో ఉన్న ప్రభుత్వాల మీద జనంలో తీవ్ర వ్యతిరేకత ఉందని భావిస్తున్నారు. తాము జనంలోకి వెళ్ళడానికి ఇవే సరైన పరిస్థితులు అని కూడా అంచనా వేసుకుంటున్నారు. ఇక కేసీఆర్ అయితే ఏడాదికి పైగా సమయం ఇచ్చి రంగంలోకి దిగబోతున్నారు. వైసీపీ అధినేత మాత్రం ఎనిమిది నెలల తరువాత కూటమి సర్కార్ మీద గట్టిగా గర్జించాలని చూస్తున్నారు. ఇక చూస్తే ఇప్పటిదాకా ఈ ఇద్దరు నేతలూ అసెంబ్లీలోనూ మాట్లాడలేదు. ఆ మాటకు వస్తే అసెంబ్లీకి కూడా వెళ్ళలేదు. మరి బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న వేళ ముందు చట్ట సభలకు వెళ్ళి అక్కడ ప్రజలు కట్టబెట్టిన ప్రతిపక్ష స్థానంతో అధికార పక్షాన్ని నిలదీసి ఆనక జనంలోకి వస్తే బాగుంటుందని అంటున్నారు. మరి ఈ విషయంలో ఇద్దరు నేతలూ ఏమి చేస్తారో చూడాల్సి ఉంది.

# భువనేశ్వరి, బాలయ్య మధ్య నలిగిపోతున్నాను...



## మొదటి పేజీ తరువాయి

"ఇది నిజంగా అద్భుతమైన సాయంత్రం. ఒకవైపున బాలయ్య... మరోవైపు అంతే పవర్ ఫుల్ అయిన భువ (భువనేశ్వరి)... ఇద్దరి మధ్యన నేను నలిగిపోతున్నా... వీళ్లిద్దరి మధ్యన ఉంటే చాలా ప్రమాదం! ఈ ఫ్యామిలీ పార్టీ గురించి కూడా నాకేమీ తెలియదు.... 'నేనేం చేస్తానో మీకు ఎవరికీ చెప్పను... నా అన్నయ్యకి నేను చేయబోయే కార్యక్రమం నా అభిమానంతో చేస్తున్నాను... ఇందులో మీకెవరికీ ప్రమేయం లేదు... ఇది నా అభిమతం' అని చెప్పి భువనేశ్వరి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది" అని చంద్రబాబు వివరించారు. ఇక, తన బావమరిది బాలకృష్ణను చంద్రబాబు ఈ సందర్భంగా పొగడ్తల్లో ముంచెత్తారు. "నిన్నటిదాకా అల్లరి బాలయ్య... ఇప్పుడు పద్మభూషణుడు... ఎన్టీఆర్ ను గుర్తుపెట్టుకునేలా బాలయ్య నడుచుకుంటున్నారు... అందుకు నేను గర్విస్తున్నాను. బాలయ్య అన్ స్టాపబుల్ కెరీర్ లో ఇదొక మైలురాయి. ఆయనకు పద్మభూషణ్ రావడం మా కుటుంబానికి గర్వకారణం. మా కుటుంబంలో ఇంతపెద్ద అవార్డు రావడం ఇదే ప్రథమం. మా కుటుంబం అంతా ఎంతో ఆనందిస్తోంది. కెరీర్ పరంగా చూస్తే బాలయ్య నాకంటే సీనియర్. ఆయన 1974లో తొలి సినిమా చేస్తే, నేను 1978లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. బాలకృష్ణ పైకి అల్లరిగా కనిపించినా, లోపల డెప్త్ ఉంది, ఒక డెడికేషన్ ఉంది. గొప్ప మానవతా దృక్పథం ఉన్న వ్యక్తి. క్యాన్సర్ ఆసుపత్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు. బాలయ్య టేకోవర్ చేసిన తర్వాత క్యాన్సర్ ఆసుపత్రి దేశంలోనే అగ్రగామి ఆసుపత్రుల్లో ఒకటిగా పేరుతెచ్చుకుంది. అందుకు నేనెంతో గర్విస్తున్నాను. ముచ్చటగా మూడు సార్లు హిందూపురంలో ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య... అప్పుడప్పుడు ఆయన అర్ధాంగి వసుంధరకు టికెట్ ఇవ్వమని అడుగుతుంటాడు. మరి కావాలనే ఆ విధంగా అడుగుతాడో, లేక ఆమెను మెప్పించడానికి అడుగుతాడో అర్థం కాదు" అంటూ చంద్రబాబు నవ్వులు పూయించారు.

# టీడీపీ ప్రయోజనాలు వేరు.. ఏపీ అవసరాలు వేరు



విశాఖపట్నం: రాష్ట్రంలో టీడీపీ ప్రయోజనాలు వేరు, రాష్ట్ర అవసరాలు వేరు అనేది స్పష్టమైందన్నారు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. బడ్జెట్ సందర్భంగా గురజాడ పేరు ప్రస్తావించడం తప్ప రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌తో బీహార్ ప్రయోజనం పొందిందని తెలిపారు. బడ్జెట్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూసిన ఏపీ ప్రజలకు ఆత్మ ఘోష మిగిలింది అంటూ ఆవేదన వ్యక?ం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విశాఖలో మీడియాతో మాట్లాడుతూ..'బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏదో కేటాయిస్తారని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూశారు. మహాకవి గురజాడ పేరును తలుచుకోవడం మనందరికీ గర్వకారణం. గురజాడ పేరు ప్రస్తావించడం తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. బడ్జెట్‌లో రాష్ట్రానికి నిరాశ, నిస్పృహ కనిపించాయి. బడ్జెట్ ద్వారా ప్రత్యేక ప్రయోజనమేమీ రాష్ట్రానికి కనిపించలేదు. బడ్జెట్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూసిన ప్రజలకు ఆత్మ ఘోష మిగిలింది. కేంద్రంలో 12 మంది నితీష్ కుమార్ ఎంపీలు, 16 మంది టీడీపీ ఎంపీల సహకారంతో ప్రభుత్వం నడుస్తోంది. బడ్జెట్‌తో బీహార్ రాష్ట్రం ప్రయోజనం పొందింది. ఏపీకి ఎటువంటి ప్రయోజనం పొందలేదు. రాష్ట్రంలో టీడీపీ ప్రయోజనాలు వేరు, రాష్ట్ర అవసరాల వేరు అనేది స్పష్టమైంది. 45.72 మీటర్లు నుంచి 41.15 మీటర్ల ఎత్తుకు కుదిస్తూ నిధులు కేటాయించడం బాధాకరం. పోలవరం ఎత్తు తగ్గించడం వలన ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుంది. మేధావులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తాము. పోలవరం ఎత్తు తగ్గించడం తీవ్ర అభ్యంతరకరం. ప్రత్యేక హెూదాను కాదని ప్యాకేజీని చంద్రబాబు తీసుకున్నారు. నేడు అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలి. ప్రజలకు నష్టం జరిగేలా చర్యలు ఉండకూడదు. కూటమి పాలనలో కంటే వైఎస్ జగన్ పాలనలో జీడీపీ, వృద్ధిరేటు అభివృద్ధి ఎక్కువగా జరిగింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం అడగాల్సిన బాధ్యత చంద్రబాబుకు లేదా?. ఎన్నికలకు ముందు సంపద సృష్టించడం తెలుసు అన్నారు. ఎన్నికల తర్వాత డబ్బు సంపాదించడం ఎలాగో నా చెవిలో చెప్పాలని చంద్రబాబు చెప్పడం ధర్మమా.? స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని చంద్రబాబు ఎందుకు చెప్పలేక పోయారు. ప్లాంట్‌పై బడ్జెట్‌లో ఎందుకు మాట్లాడలేదు. రైతుభరోసా, అమ్మఒడి ఇవ్వలేదు. రాజకీయాల్లో విశ్వసనీయత అవసరం. చంద్రబాబు ఇచ్చే హామీలు సాధ్యం కాదని ముందే వైఎస్ జగన్ చెప్పారు. వైఎస్ జగన్ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రీన్ ఎనర్జీ, బల్క్ డ్రగ్ పార్క్ వచ్చింది. వైఎస్ జగన్ పాలనలో ఒప్పందం కుదుర్చుకున్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్, బల్క్ డ్రగ్ పార్క్ కోసం అనేక సార్లు సంప్రదింపులు జరిపాము. వైఎస్ జగన్ వలనే ప్రైవేటీకరణ అగిందని కేంద్ర మంత్రి కుమార స్వామి స్వయంగా చెప్పారు అని గుర్తు చేశారు.

# వైఎస్ షర్మిలతో సీక్రెట్‌గా విజయసాయి రెడ్డి భేటీ..

## మొదటి పేజీ తరువాయి



ఏపీ కాంగ్రెస్ ఛీఫ్ వైఎస్ షర్మిలతో మూడు రోజుల క్రితం సీక్రెట్‌గా సమావేశమైనట్లు తెలుస్తోంది. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న విజయసాయి రెడ్డి.. షర్మిలను కలిశారనే విషయం ఇప్పుడు వైసీపీలో కలకలం రేపింది. మూడు రోజుల క్రితం విజయసాయిరెడ్డి హైదరాబాద్ వెళ్లి.. లోటస్‌పాండ్‌లోని షర్మిలను సీక్రెట్‌గా కలిశారని ఒక వార్త బయటకొచ్చింది. దాదాపు 3 గంటల పాటు రాజకీయ అంశాలపై వారిద్దరూ రాజకీయ అంశాలపై చర్చించారని సమాచారం. అంతేకాదు మధ్యాహ్నం భోజనం కూడా షర్మిల ఇంట్లోనే చేశారని తెలుస్తోంది. ఎంత సీక్రెట్‌గా వీళ్ల భేటీ జరిగినప్పటికీ.. ఏదోలా ఈ విషయం ఇప్పుడు బయటకు పొక్కింది. దీంతో ఏపీ రాజకీయాల్లో ఏం జరుగుతుందని వైసీపీ శ్రేణులతో పాటు మిగతా పార్టీలు ఆశ్చర్యపోయి చూస్తున్నాయి. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న విజయసాయిరెడ్డి.. అన్ని వేళలా ఆయనకు అండగా ఉన్నారు. గతంలో అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల వివాదం తలెత్తినప్పుడు కూడా జగన్‌కు మద్దతిస్తూ.. షర్మిలతో విబేధించారు. అది కాకుండా వైఎస్ వివేకానంద రెడ్డి గుండెపోటుతో మరణించారని విజయసాయి చేసిన ప్రకటనపైనా అభ్యంతరం తెలిపారు. వైఎస్ వివేకా హత్య కేసులో నిజాలు బయటపెట్టాలని కూడా షర్మిల సూచించారు. షర్మిలపై విజయసాయి కూడా పలు సందర్భాల్లో విమర్శలు చేశారు. ఇలా ముందు నుంచి విబేధాలతో ఉన్న వీరు.. ఇప్పుడు భేటీ అవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చలకు తావిస్తోంది.

# భేషజాలకు పోకుండా హైడ్రా దుకాణం బంద్ చేయండి



హైదరాబాద్ : చిన్న చిన్న బిల్డర్లను రోడ్డున పడేస్తూ, వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న హైడ్రాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా భేషజాలకు పోకుండా హైడ్రా దుకాణం బంద్ చేయాలని హరీశ్‌రావు హెచ్చరించారు. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి మన హైదరాబాద్, తెలంగాణ స్వర్గధామంగా ఉండే. అద్భుతంగా పదేండ్లు వృద్ధిలో నడిచింది రియల్ ఎస్టేట్ రంగం. లక్షలాది మంది బతికారు. కానీ కాంగ్రెస్ పాలనలో అనాలోచిత నిర్ణయాల వల్ల.. రియల్ ఎస్టేట్ రంగం కుదైలైంది. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా హైడ్రా దుకాణాలు బంద్ చేయండి.. హైడ్రా వల్ల అపార్ట్‌మెంట్లు అమ్ముడుపోవడం లేదు. హైడ్రా భయంతో కొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. చేసిన అప్పులకు మిత్తిలు కట్టలేకపోవడం, లోన్లు రాకపోవడం, భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారడం, నమ్మకం కుదరక చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మరి కూలగొట్టిన ఇండ్ల సంగతి ఏంది..?

హైడ్రా పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశావు. విదేశాల్లో ఉన్న వారు ఇక్కడ ఇండ్లు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఎందుకంటే హైడ్రాకు భయపడుతున్నారు. పెట్టుబడులు పెట్టేందుకు కూడా భయపడుతున్నారు. వేణుగోపాల్ రెడ్డి లాంటి చిన్న బిల్డర్లు.. ప్రభుత్వాన్ని గ్రాంట్, అప్పు అడగకుండా తాము బతుకుతూ పది మందిని బతికిస్తున్నారు. హైడ్రా పేరుతో పర్మిషన్లు ఉన్న ఇండ్లను కూలగొడితివి. కోర్టు మొట్టికాయలు వేయడంతో పర్మిషన్ల ఇండ్ల జోలికి వెళ్లడం లేదు అని ప్రకటన చేస్తివి. మరి కూలగొట్టిన ఇండ్ల సంగతి ఏంది..? అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

బిల్డర్లలో పాజిటివిటి లోపించింది..

మూసీ పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టే ప్రయత్నం చేస్తివి. ఆగమాగం, అనాలోచిత నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లోని బిల్డర్లలో పాజిటివిటి లోపించింది. రియల్ ఎస్టేట్ ఆగమాగమైపోయింది. రేవంత్ నిర్ణయాల వల్ల పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు భూములు అమ్ముదామంటే కూడా అమ్ముడుపోతలేవు. కేసీఆర్ పాలనలో విదేశాల నుంచే కాకుండా ఉత్తర భారతదేశం వారు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు హైదరాబాద్ నుంచి పెట్టుబడిదారులు వెళ్తున్నారు అని హరీశ్‌రావు తెలిపారు.

మరే బిల్డర్‌కు ఇలాంటి సమస్య రాకూడదు..

బిల్డర్స్ అసోసియేషన్స్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలి. మరే బిల్డర్‌కు ఇలాంటి సమస్య రాకూడదు. రేవంత్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకుని, రెడ్డి కుటుంబాన్ని పరామర్శించాలి. ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో అర్థం చేసుకుని, పరిస్థితిని చక్కదిద్దాలి. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలో ఎందుకు అనుమతులు ఆలస్యం అవుతున్నాయి. అధికారుల వేధింపులు ఎక్కువై పోయాయి. ముఖ్యమంత్రిగా, మున్సిపాల్ మంత్రిగా రేవంత్ రెడ్డినే చొరవచూపాలి అని హరీశ్‌రావు సూచించారు.

పదవులు శాశ్వతం కాదు.. ప్రజల ప్రాణాలు ముఖ్యం..

రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదు.. ప్రజల ప్రాణాలు ముఖ్యం. వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రియల్ ఎస్టేట్ రంగం పూర్వవైభవం పొందే విధంగా ప్రభుత్వం చొరవచూపాలి. ఆయన కుటుంబ సభ్యుల మాటలు వింటుంటే.. మూడు నాలుగు నెలల నుంచి ఎంతో క్షోభ అనుభవించినట్లు తెలుస్తుంది. ఎల్ఐసీలో ఉన్న రూ. 18 లక్షలు తీసుకొచ్చి అప్పులు కట్టి చనిపోయాడు. ఒక నిజాయితీ పరుడు. ఆత్మగౌరవం కలిగిన వాడు కనుక అవమానం పాలు కావొద్దు అని అప్పుల వారికి అప్పులు కట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య పరిష్కారం కాదు.. కుటుంబ సభ్యులను బాధ పెడుతాయి.. ధైర్యంగా ఎదుర్కోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాల వల్లే చివరకు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. ఆ కుటుంబానికి అండగా నిలబడి పార్టీ తరపున సహాయం అందిస్తాం. అసోసియేషన్లు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలి అని హరీశ్‌రావు కోరారు.

# అండర్-19 మహిళల జట్టుకు వైఎస్ జగన్ అభినందనలు



తాడేపల్లి : టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల అండర్-19 జట్టుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో దక్షిణాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించటంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. కాగా, మహిళల అండర్ 19 టీ20 ప్రపంచ కప్-2025 విజేతగా భారత్ నిలిచింది. కౌలాలంపూర్ వేదికగా జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసిన భారత అమ్మాయిలు.. వరుసగా రెండో సారి అండర్-19 ప్రపంచకప్ టైటిల్‌ను ముద్దాడారు. ఈ తుది పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా సరిగ్గా 20 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో వాన్ వూరస్ట్ (23) టాప్ స్కోరర్‌గా నిలవగా.. జెమా బోథా(16), ఫే కోవిలింగ్(15) పరుగులతో పర్వాలేదన్పించారు. మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు.

# ఈ బడ్జెట్ తో మధ్య తరగతి ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు: విజయసాయిరెడ్డి



**అమరావతి,:** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నిన్న 2025-26 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపునిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ లో ప్రకటించారు. దీనిపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ ఏడాది ప్రకటించిన బడ్జెట్ 'మిడిల్ క్లాస్ బడ్జెట్' గా గుర్తుండిపోతుందని తెలిపారు. పైగా ఇది ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు రికార్డు స్థాయిలో 8వ బడ్జెట్ అని వెల్లడించారు. ఈ బడ్జెట్ తో దేశంలో మధ్య తరగతి ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. ఆదాయ పన్ను ఊరట, కస్టమ్స్ సుంకాలు తగ్గించడం, దృఢమైన ఆర్థిక సంస్కరణలతో... కష్టించి పనిచేసే కుటుంబాలకు ఈ బడ్జెట్ సాధికారత కల్పిస్తుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి పథాన్ని మరింత బలోపేతం చేస్తుందని వివరించారు.

## బీర్కూరు నుండి బాసరకు పాదయాత్ర



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్) : కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలోని స్థానిక హనుమాన్ మందిరం నుండి నుండి బాసర వరకు 10వ సారి పాదయాత్ర.బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పుట్టినరోజు జన్మదినం వసంత పంచమి సందర్భంగా సుధాకర్ యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈరోజు ఉదయం స్థానిక హనుమాన్ మందిరం నుండి బాసరకు పాదయాత్ర ప్రారంభమైంది. స్థానిక హనుమాన్ మందిరం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి 95 మంది భక్తులు బాసరకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ కార్యక్రమానికి నాయకులు అవారి గంగారం గారు జండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు.ఆవారి గంగారం మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం బీర్కూర్ పట్టణం నుండి అనేక మంది నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయం కు పాదయాత్ర బయలుదేరుతారు అని తెలిపారు. అనంతరం రేపు బాసరలో అమ్మవారిని దర్శనం చేసుకొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం గురుస్వామి, గుడికొండ బాలకృష్ణ, డాక్టర్ బాలకృష్ణ, శశికాంత్, కొర్రి శివకుమార్ యాదవ్, చీదరి రాజు, మల్లొడ్డి విట్టల్, మల్లయ్యగారి ఆకాష్ కుమార్, కందకుర్తి సంతోష్ గుప్తా, ఇస్లు రాములు, కర్క సిద్దు, నారం శ్రీనివాస్, లాడేగామ్ సాయికృష్ణ తదితరులున్నారు.

## ఫోన్ చేయండి.. ఒత్తిడి తగ్గించుకోండి : బొజ్జ సురేష్ సైకాలజిస్ట్....



సంగెం (శుభోదయం న్యూస్) : : పరీక్షల వేళ విద్యార్థుల్లోని ఒత్తిడి తగ్గించి వారిలో మనోధైర్యాన్ని నింపేలా ఇంటర్ విద్యార్థులకు బొజ్జ సురేశ్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ సేవలు..విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి, ఆందోళనకు గురికావద్దు.వరంగల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో చదివే రఘు అనే విద్యార్థి ఆరోగ్య సమస్యలతో తరచూ తరగతులకు గైర్హాజరవుతున్నాడు. మొదటి సంవత్సరంలో ఫెయిలైన రెండు సబ్జెక్టులు రాయాల్సి ఉండటం ద్వితీయ సంవత్సరం పరీక్షలు దగ్గరపడటంతో ఒత్తిడికి లోనవుతున్న విషయాన్ని గుర్తించిన అధ్యాపకులు ఉచిత కౌన్సిలింగ్ సేవలపై అవగాహన కల్పించారు. 7801078784,8008200870 నెంబరుకు ఫోన్ చేసి ఆ విద్యార్థి విషయం చెప్పాడు. మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు అవగాహన కల్పించడంతో ఇబ్బంది తీరి ప్రశాంతంగా పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు.ఒత్తిడి, క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలతో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.విద్యార్థుల కోసం 24 గంటలు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. సమస్యలను ఓపికగా వింటూ సమాదానాలిస్తారు.ఇంటర్ తోపాటు భవిష్యత్తు పరీక్షలు, లక్ష్య సాదనకు అవలంభించాల్సిన పద్ధతులను వివరిస్తారు.సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటే కలిగే ప్రయోజనాలు, ఆర్యోగం సూత్రాలు, జాగ్రత్తలు, చదువు, ప్రణాళిక, ఒత్తిడి లేకుండా మార్కుల ఉత్తీర్ణత, మార్కుల సాధనకు సలహాలు ఇస్తారు.విద్యార్థుల ఉజ్వల భవితకు ఇంటర్లో పునాది పడుతుంది. పక్కా ప్రణాళికతో ఇందులో గట్టెక్క వచ్చు. ఇంటర్ వార్షిక పరీక్షలకు సమయం సమీపిస్తుండటంతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో కొందరు ఉత్తీర్ణులవుతామో లేదో మార్కులు తక్కువ వస్తాయేమోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి వారికి అండగా నిలవాలని ఇంటర్ విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కౌన్సిలింగ్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పరీక్షల వేళ విద్యార్థుల్లోని ఒత్తిడి తగ్గించి వారిలో మనోధైర్యాన్ని నింపేలా నిపుణులు సూచనలు అందిస్తున్నారు.పరీక్షల వేళ ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్నాయి.. అంతకుముందు ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రయోగపరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్ బోర్డు ఉత్తీర్ణత శాతం పెంపునకు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి ఇప్పటికే అమలు చేస్తోంది. ప్రతి వారం పరీక్షలు నిర్వహించడం, వెనకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. తల్లి దండ్రులతోనూ సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థులు అభ్యసన పెంపుపై దృష్టి సారిస్తున్నారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి, ఆందోళనకు గురికావద్దు. పరీక్షలపై సందేహాలుంటే అధ్యాపకులతో నివృత్తి చేసుకుంటే మంచిది.విద్యార్థులు ఉచిత కౌన్సిలింగ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పేదరికాన్ని కాదు పేదల్ని నిర్మూలించే బడ్జెట్ సిపిఎం ఆధ్వర్యంలో బడ్జెట్ కాపీల దహనం



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):ఆర్ఎస్ఎస్ డైరెక్షన్లో అంబానీ, అదానీ తయారీ చేసిన ఈ బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా కష్టజీవులకు వ్యతిరేకంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి విమర్శించారు.కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ వలిగొండ లో బడ్జెట్ ప్రతులను దహనం చేసారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్లమెంట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదరికాన్ని కాదు,పేదల్ని నిర్మూలించేలా,కార్పొరేట్లకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు, అంబానీ,అదానీ తయారు చేసిన బడ్జెట్ను ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో ఆర్థిక మంత్రి చదివినట్టు ఉందన్నారు. గత బడ్జెట్తో పోలిస్తే ఈసారి సామాజిక న్యాయం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీకి నిధులు కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రం నుండి 8 మంది బిజెపి ఎంపీలు ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా తెలంగాణకు బడ్జెట్లో గుండు సున్నా మిగిలిందన్నారు అదే బీహార్ లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆ రాష్ట్రానికి నిధుల వర్షం కురిపించారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికైనా బిజెపి స్వార్ధ ప్రయోజనాలను గుర్తించాలన్నారు.దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించడంలో ఉపాధి హామీ చట్టాన్ని మరింత బలోపేతం చేయడానికి రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే.. మోడీ సర్కారు మాత్రం రూ.86 వేల కోట్లకే పరిమితం చేసిందని వివరించారు. ఉత్పత్తి వర్గాలైన గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కార్మికులు, పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులు, కార్మికులు, సామాజికంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలు, ఓబీసీలు, మహిళలను బడ్జెట్ విస్మరించిందని విమర్శించారు.ఆహారభద్రతా చట్టానికి గతంలో 2.70 లక్షల కోట్లు కేటాయిస్తే,ప్రస్తుతం రూ.2.04 లక్షల కోట్లకు కుదించడం దుర్మార్గమన్నారు. గత బడ్జెట్లో గ్రామీణాభివృద్ధి కోసం రూ.2.60 లక్షల కోట్లు ప్రకటించి కేవలం 1.90 లక్షల కోట్లే ఖర్చుపెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాగైతే గ్రామాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. గత బడ్జెట్లో తాగునీటి సౌకర్యం కోసం జలజీవన్ పథకానికి రూ.70 వేల కోట్లు ప్రకటించి..రూ.22 వేల కోట్లే ఖర్చుపెట్టారనీ, ఈసారి బడ్జెట్లో రూ. 65 వేల కోట్లు కేటాయిస్తున్నామని గొప్పగా చెప్పారని విమర్శించారు. దేశ జీడీపీలో రూ.70 లక్షల కోట్ల విలువైన వ్యవసాయ రంగంపై అంబానీ, అదానీ లాంటి అంతర్జాతీయ పెట్టుబడిదారుల కన్ను పడిందనీ, అందుకే కేంద్ర ప్రభుత్వం అన్నదాతను సాగుకు దూరం చేసేలా ఎరువుల సబ్సిడీల్లో కోత పెట్టిందని వివరించారు. సామాజిక న్యాయానికి పాతరేసిందని విమర్శించారు. దేశంలోని పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని చెబుతూనే,గత బడ్జెట్లో కేటాయించిన నిధుల్లో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి 40 శాతం, పట్టణ ప్రాంతాలకు సంబంధించి 60 శాతం నిధుల్లో కోత పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు.విద్యావైద్య రంగాలను విస్మరించిన కేంద్ర బడ్జెట్,కేంద్ర బడ్జెట్ విద్యావైద్య రంగాలను విస్మరించిందని విమర్శించారు.కేటాయింపుల్లో పేపర్ల మీద బాగా చూపి గ్రామీణ ప్రాంతాలకు, సంక్షేమ రంగాలకు, సామాన్య ప్రజానీకానికి సంబంధించిన నిధుల్లో కేంద్రం నిర్ధాక్షిణ్యంగా కోతపెడుతున్న తీరును ఎండగట్టారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఇచ్చే స్కాలర్ షిప్పుల నిధుల్లో 22 శాతం కోతపెట్టిందనీ, ఆ వర్గాల పిల్లలను ఉన్నత చదువులకు దూరం చేయడంలో భాగంగానే జరుగుతున్నదని చెప్పారు. ఇది ఆధిపత్య భావజాల బడ్జెట్ కాకపోతే ఇంకేమవుతుందని ప్రశ్నించారు. ఇది కార్పొరేట్ల అనుకూల బడ్జెట్లా ఉందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి వెంకటరెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, మండల కమిటీ సభ్యులు బూడిద మణెమ్మ, నాయకులు కొండూరు సత్తయ్య,వేముల లక్ష్మయ్య, దొడ్డి యాదగిరి, మాదుగుల వెంకటేశం,పోలేపల్లి స్వామి,బూడిద సైదులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన అయిలమ్మ అంగన్వాడి ఆయా చాలా రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది, వారి యొక్కకుటుంబ సభ్యులకి ఏ జే ఆర్ ఫౌండేషన్ ఎలిమినేటి అధినేత జంగారెడ్డి సహకారంతో 5,000/ వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత ఏ జె ఆర్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్జీ వన్ జి ఎం ను ఆదేశించిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) : పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజవర్గం కార్మికులు ఎవరు కూడా అధైర్య పడవద్దు.మీ కుటుంబ సభ్యునిగా నీకు అండగా నేనున్నా ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్.కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్ జి 1 జీఎం గారికి సూచించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్. ప్రతి ఒక్క కార్మిక కుటుంబం నా కుటుంబం ఎవరికి కూడా ఎలాంటి ఇబ్బంది జరిగిన ఊరుకునే ప్రసక్తి ఉండదు ఎమ్మెల్యే రాజ్ఠాగూర్.రామగుండం జీడీకే ఓసి 5 లో గత రెండు రోజుల క్రితం క్యాంటీన్ విషయమై తలెత్తిన సమస్యపై ఎమ్మెల్యే గారికి మరియు సి ఎం ఎం డి గారికి ఫిర్యాదు చేసిన లెటర్ లో స్థానిక ఉన్న కార్మికులు సంతకాలు చేసినందుకు అధికారులు కార్మికులకు నోటీసులు జారీ చేయడం జరిగింది.స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ ఎం.స్ రాజ్ ఠాగూర్ గారికి ఫిర్యాదు చేస్తారా అంటూ నాయకులు పలువురు కార్మికులపై చర్యలు తీసుకుంటామని గని మేనేజ్ మెంట్ బెదిరింపులకు పాల్పడుతుందని ఆదివారం ఐఎన్టియుసి నాయకులు జనగామ శ్రీనివాస్ గౌడ్, మరియు అరగంటి కృష్ణ, గారు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారికి కలిసి వినతి పత్రం ఇస్తూ వారి సమస్యని తెలియజేశారు. ఈరోజు హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఎమ్మెల్యే గారు స్పందించి ఆర్జీ 1 జీఎం గారితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు కార్మికుల ఆధులను గురి కావలసిన అవసరం లేదని కార్మికులకు ఇచ్చిన నోటీసులు వెంటనే రద్దు చేయాలని గని మేనేజ్ మెంట్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ సర్పంచ్ కావేరి పద్మ చిన్నికృష్ణ



(శుభోదయం న్యూస్): బుట్టాయిగూడెం గ్రామపంచాయతీకి చెందిన బిఆర్ఎస్ పౌండర్ ఆసరెల్లి సత్యం భార్య యగు ఆసరెల్లి బానక్క నిన్న రాత్రి 12 గంటల సమయంలో గుండెపోటుతో తన ఇంటిలో తుది శ్వాస ఇవ్వడం జరిగింది .ఆమె అంతిమ యాత్రలో పాల్గొని దాహన సంస్కరణలు అయ్యేంతవరకు ఉండి కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దుర్గం నారాయణ మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ నాయకులు సునార్కని వెంకటయ్య కావేరి పోలయ్య కుమ్మరి దుర్గారావు కుమ్మరి నాగర్జున కుమ్మరి నాగరాజు ఆసరేల్లి తిరుపతి కుమ్మరి అంకులు కుమ్మరి కోటేష్ కుమ్మరి నరసింహ రావు జాడి రాజబాబు కుమ్మరి పెద్దల వెంకటయ్య కావేరి బక్కయ్య మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## కుంభం పౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం






వలిగొండ, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం కుంభం ఫౌండేషన్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుంభం ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలకు తన కూతురైన కుంభం కీర్తి రెడ్డి చైర్మన్ గా వ్యవహరిస్తూ వివిధ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా వలిగొండ పట్టణ కేంద్రంలో మండల వ్యాప్తంగా శంకర కంటి ఆసుపత్రి ఫినిక్స్ ఫౌండేషన్ వారి సహకారంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతున్నదని.కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని రాబోయే రోజులలో మెగా హెల్త్ క్యాంప్ ని నిర్వహించడానికి ఆ కుంభం ఫౌండేషన్ ముందుంటుందని ఆయన అన్నారు. కుంభం ఫౌండేషన్ చైర్మన్ కుంభం కీర్తి రెడ్డి మాట్లాడుతూ ఈ కంటి వైద్య శిబిరంలో 50 సంవత్సరాలు పైబడిన వారు కంటికి సంబంధించిన వ్యాధులను హైదరాబాదులోని శంకర కంటి ఆస్పత్రి డాక్టర్లు 36 మంది సిబ్బందిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని కంటి వైద్య పరీక్షల అనంతరం కుంభం ట్రస్టు ద్వారా ఈ శిబిరానికి విచ్చేసిన వారికి అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి మండల వ్యాప్తంగా దాదాపుగా 903 మంది హాజరైనారని అందులో 240 మందికి కంటి ఆపరేషన్ నిర్వహించడం జరుగుతుందని ఆదివారం 116 మందిని హైదరాబాదులోని ఆసుపత్రికి బస్సులలో తరలించి వారికి ఆపరేషన్ నిర్వహించి అనంతరం వలిగొండ పట్టణంలో వారిని సురక్షితంగా చేర్చడం జరుగుతుందని ఆమె అన్నారు. ఆపరేషన్ కాకుండా ఇతర కంటి వ్యాధుల వారిని గుర్తించి వారికి కావాల్సిన కంటి అద్దాలను మా ఫౌండేషన్ ద్వారా అందిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య భీమా నాయక్, మచ్చ గిరి గుట్ట చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వలిగొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని వరుణ్ గౌడ్, వలిగొండ పట్టణ యూత్ అధ్యక్షుడు పుసుకూరి లింగస్వామి, మాజీ ఉప సర్పంచ్ బత్తిని సహదేవ్, పబ్బు సురేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బత్తిని లింగయ్య, గరిశె రవి, పల్సం సతీష్, బద్ధం సంజీవరెడ్డి, బాతరాజు బాల్ నరసింహ పల్లెర్ల రాజు, కొండూరు భాస్కర్ అయిటిపాముల రవీంద్ర, కొండూరు సాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువజన నాయకులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే బిజెపి పార్టీ పార్లమెంటు సభ్యులు రాజీనామా చేసి ప్రజా తీర్పుకు రండి.రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) స్థానిక ప్రధాన చౌరస్తాలో రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు గోదావరిఖని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ పాల్గొని ప్రధాని చౌరస్తాలో గాంధీ విగ్రహం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిరసన కార్యక్రమం అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాలలో వివక్షత చూపుతూ బడ్జెట్ కేటాయించకపోవడం ఆ రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేయడం బిజెపి పార్టీ నిరంకుశ ప్రజాస్వామ్య విరుద్ధం ఒక బిజెపి పాలిత రాష్ట్రాలకు ప్రధానమంత్రి గారు ఆ విషయాన్ని గుర్తుతెలిగాలి ముఖ్యంగా



తెలంగాణ రాష్ట్రంకు తీవ్ర అన్యాయం చేశారు కేంద్రంలో గత రెండు పర్యాయములు అంటే పది సంవత్సరాలు రాష్ట్ర అధికారం ఉన్నప్పుడు యువజన హామీలు అమలు చేయక తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు ఇప్పుడు తెలంగాణ ప్రజలు మీరు ఈ రాష్ట్రాన్ని న్యాయం చేస్తారని ఎనిమిది స్థానాలు పార్లమెంటు స్థానాలు గెలిపిస్తే ఇప్పుడు కూడా విభజన హామీలు ఏ మాత్రం పట్టించుకోకుండా తెలంగాణ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడం సిగ్గుచేటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మేయర్ బంగి అనిల్ కుమార్ కాల్వ లింగస్వామి మహంకాళి స్వామి కొలిపాక సుజాత ఎండి ముస్తఫా మారెల్లి రాజిరెడ్డి సుతారి లక్ష్మణ్ బాబు బొమ్మక రాజేష్ చుక్కల శ్రీనివాస్ గట్ల రమేష్ పాత పెల్లి ఎల్లయ్య శంకర్ నాయక్ కొప్పుల శంకర్ పెద్దల్లి ప్రకాష్ తేజస్విని చుక్కల శ్రీనివాస్ గుండేటి రాజేష్ ఆసిఫ్ పాషా సింహాచలం గఫూర్ గడ్డం శ్రీనివాస్ రాజ రెడ్డి అల్లి శంకర్ కుడుదల శివ శ్రీనివాస రెడ్డి దాసరి విజయ్ ఉదయ్ రాజ్ ఆడెపు రవి గుండేటి శంకర్ ఆవిద్ సత్యనారాయణ శాంతి తో పాటు సుమారు 500 మంది కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భజగోవిందం ఏఐటియుసి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భజగోవిందం లాగా ఉందని ఏఐటియుసి పెద్దపెల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు.ఉపాధి కరువు పని కూలీలకు కూలి రేట్లు పెంపు కరువు.విద్య. వైద్యం. గృహ. ఉపాధి. యువజన. మహిళ. రంగాల అభివృద్ధికి బడ్జెట్ గోవిందాఉపాధి పరిశ్రమల అభివృద్ధికీ బడ్జెట్ గోవిందా కార్మికులకు కనీసవేతనాలు కరువు.నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కరువు.సంక్షేమ పథకాల అభివృద్ధికి నిధులకరువు.పండించిన పంటలకు గిట్టుబాటు ధరలుకరువు విభజన అంశంలోని రెండు తెలుగు రాష్ట్రాలకు బడ్జెట్ గోవిందా..ఈ బడ్జెట్ మాయల మరాటి. అంకెలగారడీ బడ్జెట్.

## టేక్మాల్లో ఘనంగా షాహిదల్లా దర్గా ఉర్సు ఉత్సవాలు



టేక్మాల్, మండలం రిపోర్టర్ క్రిష్ణ (శుభోదయం న్యూస్) : టేక్మాల్ గ్రామంలో షాహెదల్లా దర్గా 197వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉర్సు కార్యక్రమనికి వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్నారు.ముఖ్య అతిధి శ్రీ మీర్జా రహ్మత్ బేగ్ ఎమ్మెల్సీ హైదరాబాద్,దుర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షాహ్ అహ్మద్ నూరుల్ల హుస్సేని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ అహ్మద్ సర్ఫ్రజుద్దీన్ సిద్ధిఖీకార్పొరేటర్ మరియు స్టాండింగ్ కమిటీ నెంబర్ హైద్రాబాద్ దుర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షాహ్ అహ్మద్ నూరుల్ల హుస్సేని గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కి మరియు శ్రీ మహమ్మద్ అబ్దుల్ బాసిత్ నిజామిశ్రీ మహమ్మద్ వాజిద్ భాషాశ్రీ సయ్యద్ ముజీవుద్దీన్ కు సన్మానము జరిగింది.యం ఏ సలీమ్ ఖాద్రిమైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్ టియుటిఎస్
## శంకర్‌పల్లి మండల వాల్ క్యాలెండర్ ఆవిష్కరణ



శంకర్‌పల్లి, (శుభోదయం న్యూస్) : పిఆర్ టియుటిఎస్ మండల శాఖ వాల్ క్యాలెండర్ ఆవిష్కరణలో రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు మహేందర్ రెడ్డి అదేవిధంగా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్ క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొనడం జరిగింది అదేవిధంగా శంకర్పల్లి శాఖ మండల అధ్యక్షుడు బి మాణిక్యం మాట్లాడుతూ మా యొక్క సంఘానికి ఎల్లవేళలా తోడుగా ఉండి ఈ యొక్క క్యాలెండర్ కి తయారు చేయడానికి సహకరించి మాకు ఎల్లవేళలా సహకరించే శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బి సొల్ల శ్రీధర్ మరియు బొల్లారం వెంకటరెడ్డి టి జి టి ఎస్ వెంకటేశ్వరరావు మరియు ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన శ్రీమతి రమా జడ్.పి.హెచ్.ఎస్ మహాలింగాపురం వీరేశం యుపిఎస్ గాజులగూడ వీరి సహకారంతో మేము ఎన్నో ఇంకా మంచి కార్యక్రమాలు జరుపుకోవాలని వీరందరికీ ఉపాధ్యాయుల సంఘం నుంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపడం జరిగింది అదేవిధంగా శంకర్పల్లి మాజీ సర్పంచ్ బి సొల్ల శ్రీధర్ మాట్లాడుతూ నేను ఎల్లవేళలా ఎప్పుడైనా నాకు తోచిన సహాయ సహకారాలు చేయగలనని పి ఆర్ టి యు టి ఎస్ సంఘ ఉపాధ్యాయులకు తెలియజేయడం జరిగింది అదేవిధంగా మా పిలుపు మేరకు విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనవిజయం కావడానికి తమ సమయాన్ని కేటాయించిన ఉపాధ్యాయులకు పేరుపేరునా ధన్యవాదాలు అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యలు సిపిఎస్ రద్దు చేయడము బకాయిల్లో ఉన్న ఐదు డిఏలను విడుదల చేయాలని పెండింగ్ లో ఉన్న మెడికల్ బిల్స్ వెంటనే విడుదల చేయాలని ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ జారీ చేయాలని గత సంవత్సరంలో నిర్వహించిన స్పాట్ పొల్యూషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు భవిష్యత్తులో పిఆర్టియు మండల శాఖ పక్షాన శంకరపల్లి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున విద్యా సదస్సును నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పి ఆర్ టి యు టి ఎస్ మండల శాఖ అధ్యక్షులు బి మాణిక్యం, గౌరవ అధ్యక్షులు శ్రీరాములు ప్రధాన కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఫత్తేపూర్ గ్రామ కమిటీ ఎన్నిక
## కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ
## ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు



ప్రతినిధి శంకర్ పల్లి (శుభోదయం న్యూస్) : శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో ఫత్తేపూర్ వార్డులో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ మండల అధ్యక్షులు బండ్లగూడెం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నూతన అధ్యక్షులుగా కాన్నపూరం శేఖర్, ఉపాధ్యక్షులుగా చన్నగల్ల శ్రీకాంత్,కాడిగల్ల హన్మంత్,ప్రధాన కార్యదర్శి నందు, అధికార ప్రతినిధి హరీష్, వినోద్,ప్రచార కార్యదర్శి మునుగల్ల ప్రవీణ్, బాలకృష్ణ, సినియార్ నాయకులు నర్సింలు, జంగయ్య, లక్ష్మీనారాయణ, విజయ్, హరిక్రిష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్, గిరిబాబు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్లో చేనేత రంగాన్ని విస్మరించిన మోడీ సర్కార్
## గుండు వెంకటనర్సు,
## చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి



మోత్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): కేంద్ర బడ్జెట్లో చేనేత రంగాన్ని మోడీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో,మాట్లాడుతూ 2025-26 సంవత్సర బడ్జెట్ కేటాయింపులో, కేంద్ర ఆర్థిక మంత్రి చేనేతకు మొండి చెయ్యి చూపిందని, టెక్స్ టైల్స్, చేనేతకు కలిపి మొత్తం 5,272 కోట్లు ప్రతిపాధించిన కేంద్ర ప్రభుత్వం, టెక్స్ టైల్స్ రంగానికి పెద్దపీట వేసి, అందులో చేనేత రంగానికి కేవలం 200 కోట్లు మాత్రమే కేటాంచి, చేనేత పరిశ్రమ సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించ్చారు. ఎక్కువ మంది చేనేత కార్మికులు చేనేత వృత్తిపై అదారపడి జీవిస్తున్నారని, చేనేత రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో, పరిశ్రమ సంక్షోభంలో కూరుకపోయి కార్మికులు పనులు లేక రోడ్డున పడే అవకాశం ఉందని అందోళన వ్యక్తం చేసారు. చేతివృతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుతున్న మోడీ ప్రభుత్వం, చేనేత రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి, వృత్తిపై అదారపడి జీవిస్తున్న చేనేత కార్మికుల ఆకలిచావులకు,ఆత్మహత్యకు కారణం అవుతుందని విమర్శించ్చారు. చేనేత సంక్షేమ బోర్డు, కార్మికుల ఉపాధి, కనీస వేతనాల ఊసే కేంద్ర బడ్జెట్లో లేదని, చేనేత బట్టలను మిల్లుల్లో తయారు చేయకుండా, అరికట్టే ఎన్ఫోర్స్ మెంట్ కు నిధులు కేటాయించ కుండా, ఆ వ్యవస్థను కూడ నిర్వీర్యం చేసిందని, కేంద్ర బడ్జెట్ తో కార్పొరేట్లకే మేలు తప్ప, కార్మికులకు ఒరిగిందేమి లేదని విమర్శించ్చారు.

## ఈనెల 3న మోత్కూర్ లో
## కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సమావేశం



మోత్కూర్, మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): ఈనెల 3న మోత్కూరులో తుంగతుర్తి నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మార్కెట్ మాజీ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచందర్ రావు తెలిపారు. మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తామని, రానున్న స్థానిక సంస్థల్లో గెలుపు కోసం కార్యకర్తలకు దిశానిర్ధేశం చేయనున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, సమావేశానికి నియోజకవర్గంలోని 9 మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామశాఖల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, మహిళా నేతలు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నూతనంగా నియమితులైన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్, డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులకు సన్మానం ఉంటుందని తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ నారగోని అంజయ్య, నాయకులు గూడెపు పాండు, జినుకల కనకయ్య, రాచకొండ రమేష్, కారుపోతుల వెంకన్న, వల్లంభట్ల రవీందర్ రావు, బైరెడ్డి సందీప్ రెడ్డి, జంగ సురేష్, మాశెట్టి మల్లేష్, ఆలకుంట్ల శ్రీను, బుశిపాక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) గోదావరిఖని పట్టణంలో ఇటీవల మరణించిన కోట రవి గారి తండ్రి కోట రాజేశం, మరియు కడారి (కోళ్ల) శ్రీనివాస్ చిత్రపటాలకు నివాళ్లు



అర్పించి, వారి కుటుంబాలను పరామర్శించిన రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు.. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## సికింద్రాబాద్ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ చొరవతో... బోయిన్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ఆమెర్ నియామకం



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): బోయిన్పల్లి మార్కెట్ కమిటీ లో అడ్డగుట్ట డివిజన్, నార్త్ లాలాగూడ కి చెందిన ఆమెర్ కి డైరెక్టర్ నామినేటెడ్ పదవి, సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ చొరవతో లభించింది. ఈ యొక్క కార్యక్రమంలో ఆదం సంతోష్ కుమార్, ఆదం సృజన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ గత పది ఏళ్లుగా డివిజన్ కమిటీలు గాని, నామినేటెడ్ పదవులు గాని పంపిణీ చేయలేదు. కేవలం తన కుటుంబానికి మాత్రమే ఐదు డివిజన్లు అప్పచెప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే డివిజన్ కమిటీలు,




నామినేటెడ్ పదవులు, నియామకాలు జరుగుతాయని గంటా పదంగా తెలిపారు. నియోజకవర్గంలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ద్వారా తగిన గుర్తింపు ఉంటుందని ఆదం సృజన్ కుమార్ తెలిపారు. అలాగే తార్నాక డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ అమర్నాథ్ గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలకు తగిన గుర్తింపు కొరకు ఆదం సంతోష్ కుమార్ ఇన్చార్జ్ మంత్రి నుండి మొదలుకొని ముఖ్యమంత్రి వరకు వెళ్లి కార్యకర్తలకు గుర్తింపు తెచ్చే మంచి మనసున్న మనిషి అని మనకు దొరకటం మన అదృష్టం అని తెలిపారు. అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన నిధులు ద్వారానే ఈరోజు సిసి రోడ్లు గాని, పైప్ లైన్లు గాని, డ్రైనేజీ పైపులైన్లు గాని, ఇంకా అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఈ యొక్క గౌరవం కేవలం ఆదం సంతోష్ కుమార్ కి దక్కుతుందన్నారు.అలాగే సీనియర్ కాంగ్రెస్ నాయకులు జలంధర్ రెడ్డి మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క డివిజన్ కమిటీ కూడా వేయలేని పరిస్థితిని నేను



చూశానని తెలిపారు. కార్యకర్తకు కాంగ్రెస్లోనే గుర్తింపు ఉంటుందని ప్రతి ఒక్కరూ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బలోపేతం చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. దొమ్మాటి శివకుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. అలాగే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని నియోజకవర్గంలో బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో సంతోష్ యాదవ్, జలీల్ భాయ్, శాంతినగర్ కిరణ్ కుమార్, యాదుల్లా,అబ్దుల్ ని సార్, ఫ్రాన్సిస్, జునైద్, మహమ్మద్ ఖలీల్, కోటి, అరుణ్ కుమార్, హమీద్, ఆరిఫ్, రవికుమార్, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులు హృదయ శుద్ధితో జీవించాలి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : క్రైస్తవులు హృదయ శుద్ధితో జీవించాలని పలువురు బిషప్ లు ఆకాంక్షించారు. కానుక మాత 175 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కానుకమాత దేవాలయంలో నిర్వహించిన దివ్య బలి పూజా కార్యక్రమాల్లో గుంటూరు మేత్రాసన పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య, నల్గొండ బిషప్ గోవిందు జోజి, విశ్రాంత పీఠాధిపతి గాలి బాలి పాల్గొని ప్రత్యేక ఆరాధనలు చేశారు. భక్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మరియమాత లోకానికి వెలుగైన క్రీస్తును దేవునికి కానుకగా సమర్పించి పవన్ కానుకమాతగా విరాజిల్లుతోందన్నారు. క్రీస్తు నామంతో జ్ఞానస్నానం



పొందిన ప్రతి ఒక్కరూ అదే రీతిలో దేవునికి యోగమైన కానుకగా అంకితం కావాలని ప్రబోదించారు. మహిమాన్విత మరియ పేరుతో వెలసిన సుందర కానుకమాత దేవాలయం నవీకరణతో మరింతగా శోభిల్లిందన్నారు. దేవాలయం నూతనీకరణ వెనుక ఎంతో పరమార్థం దాగుందని పేర్కొంటూ మనం కూడా పాత స్వభావాలు వదిలి హృదయ శుద్ధికరణతో జీవించి దేవుని చల్లని నీడలో ఉన్నతంగా ఎదగాలన్నారు.విశ్వాసదృష్టితోనే దేవుని మహిమను స్తుతించి,దర్శించ కలుగుతామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కన్యా స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభితం.. కానుకమాత దర్శనం
## - ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : మండల కేంద్రమైన రెంటచింతలలోని కానుకమాత దేవాలయం తిరునాళ్ల వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు, గ్రామస్తులు, విశ్వాసులు తిరునాళ్లలో పాల్గొని దేవాలయంలో ప్రార్ధనలు చే వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కానుకమాత దేవాలయంలో ప్రత్యేక



ప్రార్థనలు చేశారు. విచారణ గురువుల ఆశీర్వాదం అందుకున్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా కానుకమాత తిరనాళ్ల వేడుకలు ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నాయన్నారు.దైవచింతనతో మంచి జీవితాన్ని ప్రతి ఒక్కరూ గడపాలన్నారు. కానుకమాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం కలగటం ఆనందదాయకమన్నారు. సాయంత్రం అన్ని వర్గాల ప్రజలు పురవీధులు గుండా మేళ తాళాలతో ఆలయానికి ఊరేగింపుగా వచ్చి కానుకమాతను దర్శించి కొవ్వొత్తులు అర్పించారు. రాత్రి 9 గంటల తర్వాత కానుకమాతను తేరుపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. తెల్లవారుజామున తేరు ఊరేగింపు తిరిగి ఆలయానికి చేరుకోవడంతో తిరునాళ్ల వేడుక ముగియనుంది. కానుకమాతను దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

## సామాజిక సేవకు ప్రశంస




రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : కానుకమాత తిరునాళ్ల సందర్భంగా విచ్చేయు భక్తులకు సామాజిక సేవగా మజ్జిగ, మంచినీరు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని ఎస్సై నాగార్జున నిర్వాహకులు ఏచూరి వెంకట సైదయ్యను ప్రశంసించారు. కానుక మాత 175వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఏచూరి వెంకట సైదయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ, మంచినీరు పంపిణీని ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. గత 16 సంవత్సరాలుగా కానుకమాత భక్తులకు నిస్వార్ధంగా సేవలు అందించటం ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములై మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు నాళం బాబు, రాంబాబు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## హలో మాదిగ చలో హైదరాబాద్ పిలుపునిచ్చిన
## రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ



లింగసముద్రం, మండల రిపోర్టర్ - సురేష్ (శుభోదయం న్యూస్): పద్మశ్రీ అవార్డు గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకుహలో మాదిగ చలో హైదరాబాద్ఫిబ్రవరి 7 న లక్ష డబ్బులు వేల గొంతులు ఎం ఆర్ పి ఎస్ జాతియ ఉపాధ్యక్షులు జలదంకి నరశింగరావు మాదిగ ఆధ్వర్యంలో లింగసముద్రం మండలం మొగిలిచర్ల, జంపాలవారిపాలెం కిలారివారిపాలెం,గంగపాలెం,తిమ్మరెడ్డి పాలెం, గ్రామంలో ఫిబ్రవరి 7 న జరుగుతున్న లక్ష డప్పుల వేల గొంతుల సభను జయప్రదం చేయాలని గ్రామ పెద్దలతో యువకులతో మాట్లాడి ప్రతి గ్రామం నుండి వాహనాలనుఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ నాయకులు



రామ్ మాదిగ ఆశీర్వాదం మాదిగ ఎం ఆర్ పి ఎస్ మండల నాయకులు ప్రవీణ్ మాదిగ బ్రహ్మయ్య మాదిగ సురేష్ మాదిగ కుమార్ మాదిగ ముసలయ్య మాదిగ రాజేష్ మాదిగ అవినాష్ మాదిగ మోహన్ మాదిగ మనోహర్ మాదిగ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతుల సబ్సిడీ రుణాలు దరఖాస్తులకు సిద్ధం కండి...!

### ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల అభివృద్ధి మండలి గౌరవ సలహాదారులు గోవిందరావు.



విజయనగరం, జిల్లా ప్రతినిధి బొద్దాన శ్రీనివాస్, (శుభోదయం న్యూస్): సంచారజాతుల సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల అభివృద్ధి మండలి గౌరవ సలహాదారులు రాముద్రి గోవిందరావు అన్నారు..ఆదివారం బొబ్బిలి మండలం, చిత్రకోట బడ్డవలస గ్రామంలో సంచార జాతుల సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం సంచారజాతుల కు బ్యాంకు ద్వారా లింకేజీ రుణాలు మంజూరు కోసం ప్రకటన త్వరలో చేయనున్నదని దానికి అనుగుణంగా సంచారజాతన వారు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు అవుతాయని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవడానికి సిద్ధం కావాలని ఆయన కోరారు. ఆయనతోపాటు ఈ కార్యక్రమంలో ఓదార్ల సింహాచలం సంఘం నాయకులు పాల్గొన్నారు.



## నేడే సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం



యాడికి, ఫిబ్రవరి 02 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్): మండలంలోని గుత్తి రోడ్డులో గల వాగ్దేవి ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 3న వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం, సరస్వతి పూజ నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పాఠశాలకు వచ్చే పిల్లలతో పాటు చుట్టుపక్కల పిల్లలు కూడా తల్లిదండ్రులతో పాటు హాజరు కావచ్చని తెలిపారు. ఈ సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ అక్షరాభ్యాస కార్యక్రమానికి వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు తీసుకురావాల్సిన వస్తువులు కొత్త పలక,బలపం,పసుపు, కుంకుమ,బియ్యం ఒక సేరు,అగరవత్తులు,తమలపాకులు 6,కొన్ని ఒక్కలు,పండ్లు రెండు రకాలు, దక్షిణ,ఒక పెద్ద ప్లేటు,టెంకాయ ,పూలు, కర్పూరం తీసుకురావాలని తెలిపారు. వసంత పంచమి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కావున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనివాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు.

### తెలంగాణ పిసిసి అధ్యక్షులు

## శ్రీ మహేష్ కుమార్ గౌడ్ మోడీ ప్రభుత్వం పై నిరసన కార్యక్రమం

### పాల్గొన్న సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే,

### సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్..

### ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆదం సృజన్ కుమార్..



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,(శుభోదయం న్యూస్): తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపుమేరకు ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో ఆదం సంతోష్ కుమార్, ఆదం సృజన్ కుమార్ లు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు నిధులు కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని




అన్నారు. తెలంగాణ నుండి సుమారు ఐదు శాతం పైగా జిడిపి ఉంటే, కనీసం మన వాటా మనకి ఇవ్వకుండా కేవలం రెండు శాతం మాత్రమే కేటాయించడం మన తెలంగాణ రాష్ట్రం మీద ఎంత మాత్రం ప్రేమ ఉందో కనబడుతుంది అన్నారు. అంతే కాకుండా ఇటీవల జరిగిన పద్మశ్రీ అవార్డులలో ప్రజా యుద్ధనౌక గద్దర్ విషయంలో వివక్ష చూపిన మోడీ ప్రభుత్వంపై నిరసన తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మరియు యువజన నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వసంత పంచమి సందర్భంగా పిల్లలకు బుక్కులు పెన్నులు పంపిణ





యాడికి, ఫిబ్రవరి 02 మండల రిపోర్టర్ - బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్) : మండల కేంద్రంలోని ఆర్యవైశ్య వీధిలో గలశ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి అమ్మవారి శాలలో వసంత పంచమి సందర్భంగా చిన్న పిల్లలకు క్విజ్ ప్రోగ్రాము, పాటల ప్రోగ్రాం ఏర్పాటుచేసి వారికి బుక్కులు,




పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంతా యాడికి ఆర్యవైశ్య సంఘం, వాసవి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 50 మంది పిల్లలు పాల్గొన్నారు.. పోటీలో పాల్గొన్న పిల్లలందరికీ బహుమతులు పంపిణీ చేశారు.

## అద్భుత దివ్య బాల యేసు మహోత్సవములు చివరి రోజుగా ఫాదర్ సన్మానం



నూజివీడు ప్రతినిధి ఫిబ్రవరి 2. (శుభోదయం న్యూస్):అద్భుత దివ్య బలయేసు మహోత్సవం చివరి రోజు పెరికీడు సహాయమాత టవర్ నుండి హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్లు కూడలి నందు వరకు బలయేసు ఊరేగి0పు లో క్రైస్తవా విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు తదనంతరం దివ్యపూజ కార్యక్రమంలో మెత్రసనం ఎడ్యుకేషన్ మచిలీపట్నం డి జి ఎం ఫాథర్ వల్లె జోజిబాబు గారు మరియు వికరియట్ జనరల్ పసల తోమాస్ గారు దివ్యపూజ సమర్పించారు పూజనతరం వచ్చిన గురువులకు విచారణ గురువులు ఫాథర్ చేబ్రోలు జోషాప్ తంబి గారి ఆధ్వర్యంలో గురువులకు సన్మానం చేశారు వచ్చిన భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేసి బీద లాజరు ధనవంతుడు అనే గొప్ప బైబిల్ నాటకం ప్రదర్శి0చారు.

## బాబయ్యస్వామికి పూల చాదర్ సమర్పించిన ఎస్ డబ్ల్యూ ఆర్ ఈ ఎస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ షేక్ రసూల్

### బాబయ్య స్వామి పేరున కందూరి






శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై.పోతులయ్య (శుభోదయం న్యూస్): పెను కొండ పట్టణంలో వెలసిన బాబయ్యస్వామికి సౌత్ వెస్ట్రన్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ షేక్ రసూల్ కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో పూలచాదర్, బట్టలచాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం బాబయ్యస్వామి దర్గా నందు ముస్లిం మత పెద్దలతో కలిసి బాబయ్యస్వామి మహిమలను ఫకీర్లు కీర్తిస్తూ వెంటనడవగా భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూలచాదర్ సమర్పించారు. అనంతరం స్వామివారి పేరున కందూరి ఏర్పాటు చేసి పేదలకు డాక్టర్ షేక్ రసూల్ దంపతులు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం





విధిగా స్వామివారికి పూలచాదర్ సమర్పించి కందూరి ఏర్పాటు చేసి మొక్కును తీర్చుకుంటున్నట్లు తెలిపారు. తనకు తన కుటుంబానికి బాబయ్యస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉన్నాయని, మహిమాన్వితులు బాబయ్యస్వామి భక్తుల పట్ల ప్రత్యక్షంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రసూల్ సతీమణి షాహినాబి, కుమారులు షేక్ రహిమాన్, షేక్ బషీర్,లతో పాటు యాకూబ్ , కే ఎం భాష, రహీమున్నీస,అస్మాబేగం, షబానా,జమీర్ అహమ్మద్, ముస్లిం మతపెద్దలు, ఫకీర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేములపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రారంభోత్సవం



యాడికి ఫిబ్రవరి 01 మండల రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్ ): మండలంలోని వేములపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం ప్రారంభోత్సవం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ కాశీ భవాని శంకర స్వామి సంరక్షణ, శ్రీ మహాగణపతి ,భవాని, సుబ్రమణ్య, వీరభద్ర, తేళ్ళభైరవ నాగత్రయ, నవగ్రహ, నందీశ్వర, ధ్వజస్తంభ కలశ స్థాపన (శిఖర) ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ప్రతిష్ట కార్యక్రమం మూడవ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటల ఒక్క నిమిషం నుండి 12 గంటల 24 నిమిషాల లోపు అభిజిత్ లగ్న శుభ పుష్కరాంశం నందు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని,, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరుకావాలని ఆలయ కమిటీ వారు కోరడం జరిగింది. సోమవారం ప్రతిష్ట అనంతరం విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## హుస్సేన్ సాహెబ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన బొల్లా, మెంటా, సయ్యద్





ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా జనసేన కార్యదర్శి యలమందల రహిముల్లా తండ్రి హుస్సేన్ సాహెబ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ టిడిపి యువ నాయకులు బొల్లా నరసింహారావు, టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ అమీర్ బాబు, టిడిపి యువ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు మెంటా నరసింహారావు. నివాళులర్పించన వారిలో పలువురు ప్రముఖులు, సరాబు చంద్ర తదితరులు ఉన్నారు.



## హుస్సేన్ సాహెబ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన పాలపర్తి

ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా జనసేన కార్యదర్శి యలమందల రహిముల్లా తండ్రి హుస్సేన్ సాహెబ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన టిడిపి సీనియర్ నాయకులు పామూరు నీటి సంఘం అధ్యక్షులు పాలపర్తి రమణయ్య. నివాళులర్పించన వారిలో పలువురు ప్రముఖులు పిడుగు శ్రీనివాసులు, వాయి నేని రాఘవ, సరాబు చంద్ర, పలువురు టిడిపి నాయకులు, తదితరులు ఉన్నారు.

## హుస్సేన్ సాహెబ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన మెంటా నరసింహారావు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా జనసేన కార్యదర్శి యలమందల రహిముల్లా తండ్రి హుస్సేన్ సాహెబ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన టిడిపి యువ నాయకులు, పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు మెంటా నరసింహారావు. నివాళులర్పించన వారిలో పలువురు ప్రముఖులు, సరాబు చంద్ర, పలువురు టిడిపి నాయకులు, తదితరులు ఉన్నారు.

## 42 సంవత్సరముల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం




యాడికి ఫిబ్రవరి 02 మండలా రిపోర్టర్ బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్):1981-82 లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులంతా మళ్లీ కలుసుకున్న సందర్భం యాడికి మండలంలో చోటుచేసుకుంది. వివరాలోకెళితే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 42 సంవత్సరాల కిందట పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు దాదాపు 50 మంది అపూర్వ విద్యార్థి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అప్పటి హెడ్మాస్టర్ విజయభాస్కర్ రెడ్డి టీచర్ సుబ్బారెడ్డి పాల్గొనడం జరిగింది. ముందుగా సరస్వతి పూజ నిర్వహించి కార్యక్రమం



మొదలుపెట్టారు. అనంతరం అప్పట్లో తమతో పాటు చదువుకున్న మరణించిన స్నేహితులను గుర్తుచేసుకొని వారికి రెండు నిమిషాల మౌనం పాటించడం జరిగింది. అనంతరం సభా వేదికలో ఒక్కొక్కరుగా మాట్లాడుతూ ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తి వ్యాపారాలను స్నేహితులతో పంచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలలో స్థిరపడిన వారు కూడా తమ గురువులను గౌరవించడానికి, ఆనాటి పాత మధుర స్మృతులను నెమరు వేసుకోవడానికి రావడం గమనార్హం.. అలాగే ఈ కార్యక్రమంలో గత ఐదు సంవత్సరాలుగా యాడికి మండలంలో రక్తదాన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, అనాథలకు, అంతేమ కార్యక్రమం చేయడానికి మనుషులు తక్కువైన వారికి అంత్యక్రియలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## టంగుటూరులో కుక్కల పందుల కోతుల స్వైర విహారం! పట్టించుకోని అధికార రాజకీయ గణం!!

టంగుటూరు మండల రిపోర్టర్ - వెంకటేశ్వర్లు (శుభోదయం న్యూస్) : టంగుటూరు తదితర ప్రాంతాల్లో పందులు కుక్కలు కోతుల స్వైరోహారం యధావిధిగా స్వేచ్ఛగా కొనసాగుతోంది..అనడంలో అతిశయోక్తిలేదు.కానీ వాటిని కట్టడి చేయటంలో అధికార పాలక పక్షం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశాల్లో సైతం సంబంధిత స్థానిక పీహెచ్సీ డాక్టర్లు కుక్క కాటు కేసులు తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయని మొరపెట్టుకున్న విషయం పాఠకులకు విధితమే.ఏది ఏమైనాప్పటికీ పరిసరాల శుభ్రతలో ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రధాన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై ఉందనేది చాలా స్పష్టం. ఇకనైనా రాజకీయ అధికార గణం మేల్కొనాలని ప్రజలు కోరుతున్నారు.

## గాయకులు ఘంటసాల వర్ధంతి సందర్భంగా సంగీత విభావరి




శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై.పోతులయ్య (శుభోదయం న్యూస్) : నాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం పెనుకొండ పట్టణంలోని అఫీషియల్ క్లబ్ లో సంగీత విభావరి కార్యక్రమాన్ని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, సమత సంస్థ సహకారంతో కోనాపురం ఈశ్వరయ్య, కోగిర జయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మంత్రి సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అఫీషియల్ క్లబ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ పెనుకొండ బ్రాంచ్ మేనేజర్ పవన్ కుమార్, బిజెపి నాయకులు త్రిపుర రిసార్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపీనాథ్ , గాయకులు విల్సన్ , రవిశంకర్ గురూజీ, టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు, టిడిపి నాయకులు మాధవ నాయుడు, తదితరులు పాల్గొన్నారు గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకి వర్ధంతి సందర్భంగా




ఘన నివాళులర్పించారు,సంగీత గీతాలు గానం చేస్తూ సంగీత ప్రియులను అలరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గంటసాల గొప్పతనం గురించి కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని సమాజసేవకులు సంగీత ప్రియులు దివంగత నాగేంద్ర గుప్తా కు అంకితం చేస్తున్నామన్నారు. పట్టణ ప్రముఖులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

శుభోదయం

## సంపాదకీయం

## ఎఐ సంస్థలకు ఇదో మేలుకొలుపు

### (విశ్లేషణ)

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేథ)లో వస్తున్న మార్పులు రానురాను అద్భుతాలను సృష్టిస్తున్నాయి. రాబోయే కొన్నేళ్లలో మన భవిష్యత్తును ఎఐ సమూలంగా మార్చేస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే చాట్‌జిపిటి, జెమిని, కోపైలట్ లాంటివి ఎఐలో దూసుకుపోతుండగా వీటిలో అగ్రగామిగా ఉన్న చాట్‌జిపిటిని మించిన చైనా డీప్‌సీక్ ఎఐ రంగప్రవేశం చేసింది. ఇప్పటికే చాట్‌జిపిటిని మొబైల్ వినియోగదారులంతా విచ్చలవిడిగా వాడుతున్నారు. ఇమెయిల్ రాయాలన్నా, ఏదైనా సలహా కావాలన్నా, ఏదైనా అనువాదం కావాలన్నా, కొత్త భాష నేర్చుకోవాలన్నా చాట్‌జిపిటి మనకు సహాయం చేస్తోంది. సంక్లిష్టమైన అంశాలను సులభంగా వివరిస్తోంది. పెద్దపెద్ద సమస్యలను పరిష్కరించగలుగుతోంది. చాట్‌జిపిటిని మించినది మరొకటి లేదని నిన్నటివరకు అందరం అనుకునేవాళ్లం కానీ డీప్‌సీక్ వచ్చిన తరువాత పరిస్థితి మారిపోయింది. చాట్‌జిపిటి ద్వారా ప్రపంచానికి తామే కింగ్ అని ఇన్నాళ్లూ భావిస్తూ వచ్చిన అమెరికా ఇప్పుడు చైనా అభివృద్ధి చేసిన డీప్‌సీక్‌ను చూసి నోరెళ్లబెడుతోంది. చాట్‌జిపిటిని మించి డీప్‌సీక్‌లో ఉన్న ప్రత్యేకతలేంటి? అని పరిశీలిస్తే అతితక్కువ ఖర్చుతో అత్యంత ప్రభావవంతమైన మోడళ్లను ఇది అభివృద్ధి చేసింది. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ కంపెనీలు రూపొందించిన వాటి కంటే డీప్‌సీక్ కొన్ని వందల రెట్లు అత్యంత ప్రభావవంతంగా ఉంటోంది. అందుకే డీప్‌సీక్ ధాటికి అమెరికా స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. మనం ఇచ్చిన ప్రాంప్ట్‌కి సమాధానం ఇచ్చే ముందు రీజనింగ్ కూడా ఇస్తుండటం డీప్‌సీక్ ప్రత్యేకత. చాట్‌జిపిటి సహా మిగిలిన సంస్థ లేవీ ఈ పని చేయలేకపోతున్నాయి. అంతేకాదు చాట్‌జిపిటి లాంటి వాటిని అభివృద్ధి చేసేందుకు ఓపెన్ ఎఐ లాంటి సంస్థలు కొన్ని మిలియన్ డాలర్లు ఖర్చు చేశాయి. కానీ డీప్‌సీక్‌ను కేవలం **5.6** మిలియన్ డాలర్ల ఖర్చుతోనే రూపొందించడం విశేషం. పైగా డేటా విషయంలో కానీ, టెక్నాలజీలో కానీ, స్టోరేజి విషయంలో కానీ మిగిలిన వాటికంటే డీప్‌సీక్ చాలా ముందుంది. అందుకే లక్షలాది మంది డీప్‌సీక్‌ని డౌన్‌లోడ్ చేయడం ప్రారంభించడంతో సర్వర్ తట్టుకోలేక క్రాష్ అయింది. ఆ వెంటనే (జనవరి **28**న)డీప్‌సీక్ ఎ1అసిస్ట్‌పై సైబర్ దాడి జరగడం గమనార్హం. అమెరికన్ టెక్ కంపెనీలకు డీప్‌సీక్ గట్టి షాక్ ఇవ్వడంతో రెండు రోజుల క్రితం నాస్టాక్ షేర్లు **3%**, ఎన్విడియా సంస్థ షేర్లు **17%** నష్టపోయాయి. ఒక్క ట్రేడింగ్ సెషన్ లోనే **600** మిలియన్ డాలర్లు ఎన్విడియా నష్టపోయింది. ఎన్వీడియా స్టాక్ ధర ఇంట్రాడేలో **18%** మేర క్షీణించి కనిష్ఠంగా **116.70** డాలర్లకు దిగజారింది. అమెరికాకు చెందిన అతిపెద్ద చిప్ తయారీదారు ఎన్వీడియా గత ఏడాది ఒక్క రోజులోనే భారీగా లాభపడి వాల్‌స్ట్రీట్‌లో కొత్త చరిత్రను సృష్టించింది. అలాంటి సంస్థ ఇప్పుడు డీప్‌సీక్ షాక్‌కు ఒక్క రోజులోనే భారీ పతనాన్ని ఎదుర్కొని మరోసారి చరిత్రలోకి ఎక్కడం గమనార్హం. మరి డీప్‌సీక్‌లో లోపాలు లేవా అని సందేహాలు కలగవచ్చు. డీప్‌సీక్‌కు కూడా కొన్ని మైనస్ పాయింట్లు ఉన్నాయి. చైనా సంస్థ కావడమే డీప్‌సీక్‌కు పెద్ద మైనస్ పాయింటు. భద్రత విషయంలో ఈ సంస్థను పూర్తిగా నమ్మలేకపోతున్నారు. మన డేటాను దుర్వినియోగం చేసే అవకాశాలుంటాయని అనుమానిస్తున్నారు. డీప్‌సీక్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వాళ్లు తమ డేటా విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇది చైనా సంస్థ కాబట్టి ఆ దేశ భద్రతాపరమైన అంశాలను సెన్సార్ చేస్తోంది. చాట్‌జిపిటి సహా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సంస్థలు తమ సర్వీసులను వాడుకునేందుకు ఎంతో కొంత ఛార్జ్ వసూలు చేస్తున్నాయి. కానీ డీప్‌సీక్ మాత్రం పూర్తిగా ఉచితం. దీనికి తోడు మిగిలిన వాటి కంటే వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. ఇంతకీ సంచలనం కలిగిస్తున్న ఈ డీప్‌సీక్ ఎ1 స్టార్టప్ వ్యవస్థాపకుడు లియాంగ్ వెన్‌ఫెంగ్ **1985**లో చైనాలో గ్వాంగ్‌డాంగ్‌లోని ఝాన్‌జియాంగ్‌లో ఒక సాధారణ కుటుంబంలో జన్మించాడు. అతని తండ్రి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. లియాంగ్ చదువులో చాలా తెలివైనవాడు. ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీని పొందాడు. చైనాలోని జెజియాంగ్ విశ్వవిద్యాలయం నుండి ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీని పొందాడు. మెషిన్ లెర్నింగ్ ఫైనాన్షియల్ విశ్లేషణపై విస్తృతమైన పరిశోధనలు చేశాడు. క్వాంటిటేటివ్ ఫైనాన్స్‌లో స్పెషలైజేషన్ చేసిన తరువాత **2023**లో డీప్‌సీక్ స్టార్టప్ కంపెనీని ప్రారంభించాడు. ఫైనాన్షియల్ డేటాను విశ్లేషించేందుకు ఎఐని వినియోగించే హెడ్‌ఫండ్‌కు గతంలో నేతృత్వం వహించాడు. ఈయన టీం ఓపెన్‌సోర్స్ ఎఐ మోడల్‌ను డెవలప్‌చేసింది. దీన్ని డీప్‌సీక్ ఆర్1గా పిలుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న డెవలపర్స్‌కు దీన్ని ఉచితంగా అందించారు. వాళ్లు తమ టెక్నాలజీని మెరుగుపర్చుకునేందుకు డీప్‌సీక్ ఆర్ 1ను వినియోగించుకోవడం పరిపాటి అయింది. సాంకేతిక ఆధిపత్య రేసులో చైనా ముందుకు వెళ్లకుండా నిరోధించడానికి, జిపియు, సెమీకండక్టర్ల వంటి అత్యంత ఆధునిక టెక్నాలజీలను చైనాకు ఎగుమతి చేయడాన్ని అమెరికా నిషేధించింది. కానీ ఇవేవీ చైనాపై ఎలాంటి ప్రభావం చూపలేదని డీప్‌సీక్ అద్భుత విజయంతో స్పష్టమవుతోంది.ఈ నేపథ్యంలో అమెరికా టెక్ కంపెనీలకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక చేశారు. ఇదో మేలుకొలుపుగా గుర్తించాలని అప్రమత్తం చేశారు. అతితక్కువ ఖర్చుతో డీప్‌సీక్ అందుబాటులోకి రావడం సానుకూల అభివృద్ధిగా అభివర్ణించారు. బిలియన్ల కొద్దీ ఖర్చు చేసే బదులు తక్కువ ఖర్చుతోనే ఇలాంటివి చేయాలని, అలాంటి పరిష్కారంతోనే ముందుకు రావాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ట్రంప్ ఈ విధంగా స్పందించారంటే డీప్‌సీక్ ప్రకంపనలు ఏ విధంగా ఉన్నాయో తెలుస్తుంది.

## కేంద్ర బడ్జెట్ నుండి NDA మిత్రపక్షాలు ఏమి పొందాయి?

# ఏపీకి కేటాయించింది ఎంత?



మధ్యతరగతి ప్రజలు ముఖ్యంగా వేతనజీవులకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఊహించని కానుక అందించారు. ఆదాయపన్ను విషయంలో ఆమె ఎంతో ఉదారంగా వ్యవహరించారు. భారతదేశ చరిత్రలో ఇంత వరకు ఎన్నడూ లేని రీతిలో ఆదాయపన్ను మినహాయింపును నిర్మలా సీతారామన్ భారీగా ప్రకటించారు. ధరలు పెంచారా, తగ్గించారా అనే విషయాలు పక్కన పెడితే బడ్జెట్ అనగానే వేతనజీవులు ఆశగా ఎదురుచూసేది ఆదాయ పన్ను మినహాయింపు. ఈసారి వారి పంట పండింది. మధ్య తరగతి ప్రజలు ముఖ్యంగా వేతనజీవులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఊహించనంత భారీ ఊరట కల్పించింది. ఆదాయ పన్ను పరిమితిపై వస్తున్న రకరకాల ఊహాగానాలను తల్లకిందులు చేస్తూ ఏకంగా 12 లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్నవారికి పూర్తిగా పన్ను మినహాయింపును నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశాభివృద్ధిని పెంచేందుకు, ప్రపంచంతో పోటీ పడేందుకు పన్నుల వ్యవస్థ, విద్యుత్ రంగం, పట్టణాభివృద్ధి, మైనింగ్, ఆర్థిక రంగం, నియంత్రణా సంస్కరణలనే ఆరు కీలక రంగాలను నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. ఇండియా పోస్ట్‌ను భారీ ప్రభుత్వ రంగ రవాణా సంస్థగా మార్చుతామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. కొత్త ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విశ్వకర్మలు, మహిళలు, స్వయంసహాయక సంఘాలు, %మీవీజు%లు, భారీ వ్యాపార సంస్థల అవసరాలు తీర్చేలా ఇండియా పోస్ట్ పనిచేస్తుందని తెలిపారు. 50 కోట్ల రూపాయలతో విద్యారంగం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. రానున్న ఐదేళ్లలో మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులలో వైద్య సీట్లు 75 వేలకు పెంచాలనే లక్ష్యంతో వచ్చే సంవత్సరం కొత్తగా 10వేల అదనపు సీట్లు తీసుకురానున్నట్టు తెలిపారు. మోదీ ప్రభుత్వ బడ్జెట్ 2025పై రాజకీయ పక్షాలు స్పందించాయి. ఇది ప్రజల బడ్జెట్ అని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రభుత్వ ఖజానా నింపడం కాదు పౌరుల జేబులు నింపడంపై దృష్టి పెట్టిన బడ్జెట్ ఇదని ప్రధాని అన్నారు. వికసిత్ భారత్‌ను సాకారం చేసే లక్ష్యంగా.. బడ్జెట్ బ్రహ్మాండంగా వుందని ఎన్‌డీఏ నేతలు అన్నారు . మూడు రాష్ట్రాల ఎన్నికల కోసమే బుల్డోజ్ చేసినట్టుగా వుందని బడ్జెట్‌పై విపక్షాలు విమర్శిస్తున్నాయి. పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న సమయంలో కూడా విపక్ష ఎంపీలు బీహార్‌పై దుమారం రేపారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని విపక్ష ఎంపీలు అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రజానుకూలమైన ప్రగతి శీలబడ్జెట్ అభివర్ణించారు సీఎం చంద్రబాబు . కేంద్ర మంత్రులు, కూటమి ఎంపీలు. ప్రధానికి మోదీకి , నిర్మాలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిసారు .ఎంత వీలైతే అంత మొత్తంలో ఏపీకి నిధులు తెస్తామన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విఫలమైంది. పార్టీ 272 అనే మ్యాజికల్ ఫిగర్‌కు 32 అడుగుల దూరంలో ఉండిపోయింది. ఆ తర్వాత NDA పార్టీల సహాయంతో నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. ఎన్డీయేలో బీహార్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రభావం ఎక్కువగా ఉంది. బీహార్‌లోని JDU, LJP (R), HAM (SE) ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నాయి. అలాగే చంద్రబాబు నాయుడు పార్టీ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన టీడీపీ, పవన్ కళ్యాణ్‌కి చెందిన జనసేన కూడా ఎన్డీయేలో భాగమయ్యాయి. గత బడ్జెట్‌లోనూ కూడా రెండు రాష్ట్రాలు బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈసారి కూడా బడ్జెట్‌లో ఇద్దరికి ఆధిక్యత చూపెట్టారు. మోదీ ప్రభుత్వం బడ్జెట్‌లో మిత్రపక్షాలకు ఏం ఇచ్చిందో ఒక్కొక్కటిగా తెలుసుకుందాం. చంద్రబాబు నాయుడు పార్టీకి 16 మంది ఎంపీలు, పవన్ కళ్యాణ్ పార్టీకి 2 ఎంపీలు ఉన్నారు. ఈసారి చంద్రబాబు నాయుడు చేపట్టబోయే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించాలని మోదీ సర్కార్‌ను కోరారు. దానికి కేంద్రం అంగీకరించింది. ఆంధ్రాకు చెందిన పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు రూ.30,436 కోట్లకు ఆమోదం తెలిపింది. కేంద్రం కూడా ఏపీ ప్రభుత్వానికి పాత బకాయిలను అందించనుంది. ఈ ప్రాజెక్ట్ గోదావరి నది ఏలూరు జిల్లాలో నిర్మిస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15,000 కోట్లు కేటాయించింది. 2013లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగింది. అప్పటి నుంచి రాజధాని హైదరాబాద్ ఆంధ్రాకి దూరమైంది. ఇప్పుడు అమరావతిని రాజధాని చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం బిజీగా ఉంది. న్యూక్లియర్ సోలమ్ ప్రాజెక్ట్ కింద ఆంధ్ర కూడా వాటా పొందనుంది. అయితే దీని అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కు ప్రస్తుతం 12 మంది లోక్ సభ ఎంపీలు ఉన్నారు. ఈ ఏడాది చివర్లో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే బీహార్‌లో నితీష్ కుమార్‌కు మద్దతుగా పెద్ద ప్రకటనలు చేశారు. వీటిలో మఖానా బోర్డు ఏర్పాటు ముఖ్యమైనది. దీంతో మిథిలాంచల్ ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. దీంతో పాటు పాట్నా, బిహ్తా విమానాశ్రయాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇక, పశ్చిమ కోసి కెనాల్ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు వల్ల దర్భంగా, మధుబని ప్రజలు లబ్ధి పొందనున్నారు. రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 20 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. అలాగే, బీహార్‌లో 3 గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలను నిర్మించాలనే యోచనలో ఉన్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ విమానాశ్రయం రాజ్‌గిర్, సోన్‌పూర్, భాగల్‌పూర్‌లలో ప్రతిపాదించారు. రాజ్‌గిర్ నితీష్ సొంత జిల్లా నలందలో ఉంది. బీహార్ రాష్ట్రానికి చెందిన చిరాగ్ పాశ్వాన్ ఎన్డీయేలో భాగస్వామిగా కొనసాగుతున్నారు. చిరాగ్ పార్టీకి 5 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్నారు. చిరాగ్ కోసం నేషనల్ ఫుడ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ ప్రకటించింది కేంద్రం. చిరాగ్ మంత్రిగా ఉన్న ఫుడ్ అండ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ క్రింద ఈ సంస్థ ఏర్పాటు కానుంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌ను జాముయి, హాజీపూర్ లేదా సమస్తిపూర్‌లో నిర్మించవచ్చని చెబుతున్నారు. మూడు చోట్లా చిరాగ్ పార్టీకి చెందిన ఎంపీలు ఉన్నారు. చిరాగ్ స్వయంగా హాజీపూర్ ఎంపీగా కొనసాగుతున్నారు. అతని బావ అరుణ్ భారతి జముయి నుంచి ఎంపీగా ఉన్నారు. చిరాగ్ స్వస్థలం సమస్తిపూర్‌లో కావడం విశేషం. అజిత్ పవార్ NDA మిత్రపక్షంలో ఉన్నారు. పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎం కూడా. అజిత్ పవార్ డిమాండ్‌ను బీజేపీ కూడా పరిగణనలోకి తీసుకుంది. పుణెలో మెట్రో కోసం రూ.837 కోట్లు ఇచ్చారు. పూణే అజిత్ పవార్ స్వస్థలం. ఆయన ఇక్కడ రక్షణ మంత్రిగా కూడా ఉన్నారు. ఇది కాకుండా, మహారాష్ట్ర అగ్రి బిజినెస్ నెట్‌వర్క్-మాగ్నెట్ ప్రాజెక్ట్ కోసం బడ్జెట్‌లో రూ.596 కోట్లు కేటాయించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఏక్నా మహారాష్ట్ర అగ్రి బిజినెస్ నెట్‌వర్క్-మాగ్నెట్ ప్రాజెక్ట్ కోసం బడ్జెట్‌లో థ్ షిండే కూడా బీజేపీకి ప్రధాన మిత్రుడు. బీజేపీ కూడా వీరిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ముంబైలో మెట్రో కోసం రూ.1,600 కోట్లు ఇచ్చారు. డిప్యూటీ సీఎం షిండే ముంబైకి గార్డియన్ మంత్రిగా ఉన్నారు. గ్రీన్ అర్బన్ మొబిలిటీ ప్రాజెక్ట్ కింద ముంబైకి రూ.1,094 కోట్లు ఇచ్చారు. లోక్‌సభలో ఏకనాథ్ షిండేకు మొత్తం 7 మంది ఎంపీలు ఉన్నారు. బడ్జెట్‌ను షిండే స్వాగతించారు.

## తెలంగాణలో పవర్ అలర్ట్.. సమ్మర్ స్టార్ట్ కాకముందే రికార్డు స్థాయిలో వినియోగం..



సహజంగానే వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. డిమాండ్‌కు తగ్గ సప్లై చేయటానికి డిస్కంలు కసరత్తులు చేస్తుంటాయి. ఈసారి సమ్మర్ స్టార్ట్ కాకముందే ఈ కసరత్తును విద్యుత్ రంగ సంస్థలు ప్రారంభించాయి. గత ఏడాది మార్చిలో అత్యధికంగా 15 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడితే ఈసారి వేసవి రాకముందు జనవరిలోనే 15,205 మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. ఎండలు పూర్తిగా మొదలు కాకముందే ఈ రకమైన డిమాండ్ ఉంటే పిక్ సమ్మర్‌లో ఊహించని స్థాయిలో డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అయితే కేవలం గృహ వినియోగం వల్లనే ఇంత డిమాండ్ పెరగలేదు. దీనికి పలు కారణాలు ఉన్నాయి.ఈసారి వర్షాలు బాగా పడి రికార్డ్ స్థాయిలో పంట దిగుబడి సాధించింది తెలంగాణ రాష్ట్రం. అందుకు వ్యవసాయ విద్యుత్ వినియోగం డిమాండ్ చాలా పెరిగింది. దాంతో పాటు పారిశ్రామిక గృహ వినియోగంలో కూడా భారీగా వృద్ధిరేటు కనపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ జనవరిలో పదివేల మెగావాట్ల విద్యుత్ రిమాండ్ ఏర్పడితే ఒక్క హైదరాబాద్ మహానగరంలోనే 5000 మెగాపట్ల డిమాండ్ ఉంది. మొత్తం కలిపి 15 వేల మెగాపట్ల డిమాండ్ ఏర్పడింది. ఏడాది పీక్ సమ్మర్‌కి కనీసంగా 17000 నుంచి 18 వేల మెగావాట్ల పైచిలుకు డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.

ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

యాసంగితో పాటు రానున్న ఎండాకాలంలో డిమాండ్‌కు తగ్గట్టుగా క్వాలిటీ కరెంట్ సప్లై చేయడంపై తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు దృష్టి సారించాయి. విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ రంగ సంస్థలు ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూలు నిర్వహిస్తున్నాయి. విద్యుత్ శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఎప్పటికప్పుడు పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా సప్లై ఏ విధంగా ఉందనే అంశంపై మానిటర్ చేస్తున్నారు. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు.

జనవరి 31న రికార్డు స్థాయిలో 15,205 మెగావాట్లు వినియోగం

గతేడాది జనవరిలో పీక్ డిమాండ్ 13,810 మెగావాట్లు కాగా ఈ సంవత్సరం జనవరి 31న రికార్డు స్థాయిలో 15,205 మెగావాట్లు నమోదైంది. ఇది గతేడాది పీక్ సమ్మర్‌లో ఉన్న డిమాండ్ కన్నా ఎక్కువ. పోయిన ఏడాది మార్చి మూడున అత్యధికంగా 15,623 మెగా డిమాండ్ ఏర్పడింది. డిమాండ్ ఎంత పెరిగిన దానికి తగ్గట్టుగా సరఫరా అందించేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ తాకిడిని తట్టుకోవడానికి సీనియర్ ఇంజనీర్లను ప్రతి జిల్లాకు నోడల్ అధికారులు నియమించి, విద్యుత్ కంట్రోల్ రూమ్ 1912 బలోపేతం చేసి ఎప్పుడు ప్రజల్లోకి అందుబాటులో ఉంచామని అధికారులు తెలిపారు.

డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తికి కసరత్తు

మరోవైపు పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సింగరేణి ద్వారా నిరంతరాయంగా రోజుకు 17 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు సరఫరా జరిగే విధంగా చూస్తున్నారు. దాంతోపాటు సోలార్ పవర్ల సామర్థ్యాన్ని కూడా పెంచాలని చూస్తున్నారు. ఇక పవర్ బ్యాంకింగ్ విధానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో డిమాండ్కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా చేయగలమని అధికారులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాలకు లో డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు ఇక్కడి నుంచి సప్లై చేసి ఇక్కడ డిమాండ్ అధికంగా ఉన్నప్పుడు అక్కడి నుంచి దిగుమతి చేసుకునే విధానమే పవర్ బ్యాంకింగ్. ఉత్తర దక్షిణ భారతదేశానికి విద్యుత్ వినియోగ సీజన్లలో వ్యత్యాసాలు ఉండటంతో పవర్ బ్యాంకింగ్ విధానం ద్వారా పిక్ సమ్మర్ టైంలో డిమాండ్‌కు తగ్గ సప్లై చేయగలమని అధికారులు చెబుతున్నారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో అసలేం జరిగింది.. రహస్య భేటీకి వెళ్లిన ఆ ఎమ్మెల్యేలు ఎవరు..?



తెలంగాణ కాంగ్రెస్‌లో కల్లోలం మొదలైంది. 10 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల రహస్య భేటీపై ప్రకపంనలు రేపుతోంది. దాదాపు 10మంది ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లోని ఓ హెూటల్‌లో సీక్రెట్ మీటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఓ మంత్రి తీరుపై ఎమ్మెల్యేల అసంతృప్తి ఉన్నారట. ఆయన తమను అసలు పట్టించుకోవడం లేదని ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. తమ నియోజకవర్గంలో తమకు తెలియకుండా నిర్ణయాలు జరుగుతున్నాయని వారు అసహనం వ్యక్తం చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. భవిష్యత్ కార్యాచరణపై వారంతా ఈ సమావేశంలో సమాలోచనలు జరిపారు. ఓ కీలక మంత్రి తమ నియోజకవర్గాల్లో భూములు రెగ్యులర్ చేసుకుంటున్నారని ఎమ్మెల్యేలు ఆగ్రహంతో ఉన్నారట. బీఆర్ఎస్ నేతలకు ప్రభుత్వంలో పనులు అవుతున్నాయని పలువరు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. శుక్రవారం రహస్యంగా భేటీ అయిన ఎమ్మెల్యేలకు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు ఫోన్ చేశారు. ఇదే విషయంపై మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలకు మంత్రులకు సమన్వయంపై సీఎం ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో ఇప్పటికే వర్గీకరణపై రచ్చ కొనసాగుతుండగా 10 మంది ఎమ్మెల్యేల రహస్య భేటీ మరింత హీట్ పెంచింది.

**రహస్య భేటీలో పాల్గొన్న ఆ ఎమ్మెల్యేలు ఎవరంటే..**

-నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, భూపతిరెడ్డి,-జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి,-మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, -నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కె.రాజేష్ రెడ్డి,-నారాయణఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి, -నర్సంపేట ఎమ్మెల్యే దొంతు మాధవరెడ్డి,-మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ -వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సహా మరో ఇద్దరు ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్టు ప్రచారం జరుగుతోంది.

కాగా, తాము భేటీలో పాల్గొన్నది నిజమేనని సీఎంకు, టీపీసీసీ చీఫ్‌కు సమాచారం ఇచ్చినట్లు 10 మంది ఎమ్మెల్యేలు చెబుతున్నారు. త్వరలోనే అధిష్టానంతో అన్ని విషయాలు మాట్లాడుతామన్నారు. మరోవైపు ఇది కేవలం ఒక మంత్రికి ఎమ్మెల్యేలకు మధ్య జరిగిన చిన్న గొడవ మాత్రమేనని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

## బడ్జెట్‌లోఉపాధిహామీ పథకం నిర్లక్ష్యంపై మండిపడిన కాంగ్రెస్



న్యూఢిల్లీ : బడ్జెట్‌లో ఉపాధిహామీ పథకం నిర్లక్ష్యంపై కాంగ్రెస్ మండిపడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల పరిస్థితులు దిగజారుతున్నప్పటికీ.. మోడీ ప్రభుత్వం ఈ ఏడాది ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌ను రూ.86,000 కోట్ల వద్ద నిలిపివేసిందని కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ ఆదివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది ఉపాధి హామీ పథకం నిజమైన కేటాయింపులు (ధరల పెరుగుదల కోసం సర్దుబాటు చేయబడిన)లో క్షీణతను సూచిస్తుందని అన్నారు. గాయానికి అవమానం తోడైనట్లు, బడ్జెట్‌లో 20శాతం గత సంవత్సరాల బకాయిలను క్లియర్ చేయడానికి చెల్లించినట్లు అంచనాలు సూచిస్తున్నాయని అన్నారు. ఇది ఉపాధి హామీ పథక పరిధిని తీవ్రంగా తగిస్తుందని, కరువు పీడిత, గ్రామీణ ప్రజలను మరింత పేదరికంలోని నెట్టివేస్తుందని అన్నారు. కార్మికులకు వేతనాల పెంపును కూడా నిరోధిస్తుందని అన్నారు. కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరంలో కూడా, కనీస సగటు గుర్తించిన వేతన రేటు కేవలం 7శాతం మాత్రమే పెరిగింది. ఇది వినియోగదారుల ధరల సూచి (సిపిఐ) ద్రవ్యోల్బణం 5శాతంగా అంచనావేసిన సమయంలో అని, దీంతో ఉపాధి హామీలో వేతన స్తబ్దత జాతీయ సంక్షోభానికి దారితీస్తుందని అన్నారు. ఈ కీలక భద్రత వలయం పట్ల నిర్లక్ష్యం గ్రామీణ ప్రజల జీవనోపాధి పట్ల ఉదాసీనతను బహిర్గతం చేస్తుందని మండిపడ్డారు. 2023-24లో, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కోసం కేటాయింపులు రూ. 60,000 కోట్లు అయితే, అదనపు నిధులు అందించబడ్డాయి. వాస్తవ వ్యయం రూ.89,153.71 కోట్లుగా ఉన్నట్లు బడ్జెట్ నివేదిక పేర్కొంది. 2024-25లో అదనపు కేటాయింపులు జరగలేదు.

# రైల్వేలకు పాత పద్దే!

## రూ.2.52 లక్షల కోట్ల నిధుల కేటాయింపు

న్యూఢిల్లీ: కొత్త బడ్జెట్‌లో రైల్వేశాఖ పద్దుల్లో పెద్దగా మార్పులేమీ రాలేదు. 2025%-%26 బడ్జెట్‌లో ఈ శాఖకు మొత్తం రూ.2.52 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రైల్వేలు మొత్తం రూ.3,02,100 కోట్ల ఆదాయం ఆర్జిస్తాయని అంచనా వేశారు. మరో 200 వందేభారత్ రైళ్లు, 100 అమృత్ భారత్ రైళ్లు, 50 నమోభారత్ రైళ్ల ప్రవేశపె ట్టేందుకు అనుమతి ఇచ్చారు. వచ్చే నాలుగేళ్ల లో మొత్తం రైల్వే మౌలిక వసతుల కల్పన కోసం రూ.4.5 లక్షల కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు బడ్జెట్ ప్రకటన అనంతరం శనివారం రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

### ఆదాయ అంచనా రూ.3 లక్షల కోట్లు

2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వే శాఖ అన్ని మార్గాల ద్వారా రూ.3,02,100 కోట్ల ఆదాయం ఆర్జిస్తుందని అంచనా వేశారు. 2024-25 బడ్జెట్‌లో సవరించిన అంచనా ప్రకారం ఇది రూ.2,79,000 కోట్లుగా ఉంది. గత బడ్జెట్‌లో ప్రయాణికుల చార్జీల ఆదాయం 2024-25లో రూ.80,000 కోట్లు ఉండగా, 2023-24లో రూ.70,693 కోట్లు వచ్చింది. 2024-25 బడ్జెట్‌లో సరుకు రవాణా ద్వారా రూ.1,80,000 కోట్ల ఆదాయం వస్తుందని సవరించిన అంచనాల్లో పేర్కొన్నారు. 2023-24లో ఇది 1,68,199 కోట్లుగా ఉంది. రైల్వేల్లో భద్రతాపరమైన చర్యల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల ప్రకారం రూ.1,14,062 కోట్లు ఉండగా, 2025-26 బడ్జెట్‌లో దీనిని రూ.1,16,514 కోట్లుగా అంచనా వేశారు. అయితే, ఇంతగా నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ రైల్వేలకు వస్తున్న ఆదాయంలో మాత్రం పెద్దగా పెరుగుదల ఉండటం లేదని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్, టెలి కమ్యూనికేషన్స్ మాజీ డీజీ శైలేంద్రకుమార్ గోయెల్ చెప్పారు.



### మరో 200 వందేభారత్ రైళ్లు: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

దేశవ్యాప్తంగా మరో 200 వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తక్కువ దూరంగల పట్టణాల మధ్య ప్రయాణించే అమృత్ భారత్ రైళ్లను మరో 100 ప్రారంభిస్తామని చెప్పారు. 17,500 కొత్త కోచ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వివరించారు.

## ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడి



ప్రత్తిపాడు : మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం స్వగృహంలోకి యువకుడు ట్రాక్టర్ పై వచ్చి పార్కింగ్ లో కార్ వెనక బాగాన ఢీ కొట్టాడు. అనంతరం కాళీ స్థలంలో ట్రాక్టర్ తో రౌండ్స్ వేసి భీభత్సం చేసాడు. స్థానికులు యువకుడును పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కిర్లంపూడి పంచాయతీ పరిధిలో జగపతి నగరం గ్రామానికి చెందిన గనిశెట్టి గంగాధర్ యువకుడు ముద్రగడ నివాసంలో తెల్లవారుజామునే ట్రాక్టర్ పై వచ్చి రాగానే గ్రౌండ్లో రోడ్డును ధ్వంసం చేసి కారు వెనుక భాగాన్ని ఢీకొట్టాడు. గంగాధర్ జనసేన పార్టీ అభిమానిగా గుర్తించారు. మాజీ మంత్రి వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభంను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వైసీపీ నాయకులు ముద్రగడ పద్మనాభంను కలిశారు. ముద్రగడ పద్మనాభం నివాసంపై జరిగిన దాడి జరిగిన విషయాన్ని తెలుసుకొని ముద్రగడ నివాసంలో ముద్రగడను జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు చెల్లబోయిన వేణు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ వంగా గీత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

## రథసప్తమికి ప్రణాళికాబద్ధంగా సేవలు అందించాలి



తిరుమల : రథసప్తమికి వచ్చే యాత్రికులకు ఉద్యోగులు సమిష్టిగా, ప్రణాళికాబద్ధంగా సేవలు అందించాలని టిటిడి ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. రథసప్తమి రోజున గ్యాలరీలలో యాత్రికులకు అందించే సేవలపై ముందస్తుగా క్షేత్రస్థాయిలో కార్యాచరణ సిద్ధం చేసుకుని సమిష్టిగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రతి గ్యాలరీకి ఇంఛార్జితో పాటు, అన్ని శాఖల విభాగాల అధికారులకు బాధ్యతలను అప్పగించామన్నారు. పోలీసులు, విజిలెన్స్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని, ప్రతి ఉద్యోగి కూడా సంబంధిత విభాగాలతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. యాత్రికులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్నదానం, పోలీసు, విజిలెన్స్, ఇంజనీరింగ్, వైద్య, ఆరోగ్య, శానిటేషన్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ఉమ్మడి కార్యాచరణతో సేవలు అందించాలన్నారు. ఉన్నత ప్రమాణాలతో శానిటేషన్ సేవలు అందించాలని సూచించారు. అత్యవసర విభాగాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి సివిఎస్వో మణికంఠ చందోలు, టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, ఎఫ్ఏఅండ్ సీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వారానికి 120 గంటల పని.. మస్క్ సంచలన ట్వీట్



వాషింగ్టన్:ఇన్ఫోసిస్ నారాయణమూర్తి పనిగంటల పెంపు వ్యాఖ్యల వివాదం అమెరికాను తాకింది. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డీవోజీఈ) చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రముఖ బిలియనీర్ ఇలాన్‌మస్క్ ఈ విషయంలో నారాయణమూర్తి కంటే చాలా అడుగులు ముందుకు వేశారు. తాను తన డీవోజీఈ డిపార్ట్‌మెంట్ సిబ్బంది ఏకంగా వారానికి 120 గంటలు పనిచేస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా ఉన్నతస్థాయి అధికారులు వారానికి కేవలం 40 గంటలు మాత్రమే పనిచేస్తున్నారని అందుకే పౌరులు చెల్లిస్తున్న పన్ను సొమ్ము వృథా అవుతోందని మస్క్ తెలిపారు. ఈ మేరకు మస్క్ ఎక్స్(ట్విటర్)లో ఒక పోస్టు చేశారు. అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థపై డీవోజీఈ చేస్తున్న ఆడిట్‌లో సంచలన విషయాలు బయట పడుతున్నాయని, ప్రజల డబ్బు ఎలా దుర్వినియోగమవుతోందో తెలుస్తోందని మస్క్ అన్నారు. అయితే డీవోజీఈ ఆడిట్‌లపై ఉద్యోగుల సంఘాలు మండిపడుతున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికా బ్యూరోక్రసీని సమర్థవంతంగా తయారుచేసేందుకు ట్రంప్ డీవోజీఈ చీఫ్‌గా మస్క్‌ను నియమించిన విషయం తెలిసిందే. కాగా, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తితో పాటు ఎల్అండ్‌టీ చీఫ్ సుబ్రమణియన్ తదితరులు ఎక్కువ పనిగంటల విధానమే మేలని వ్యాఖ్యానించి వివాదానికి కారణమయ్యారు. అయితే భారత ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఆర్థిక సర్వే మాత్రం 60 గంటల కంటే ఎక్కువ పనిచేస్తే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని పేర్కొనడం గమనార్హం.

# ఆగ్రహం.. ఆరోగ్యానికి అనర్థం

**అంతర్గతంగా ఆరోగ్యంపై ప్రభావం.. అధ్యయనాల వెల్లడి**

**17 శాతం గుండె జబ్బులు, స్లీప్ సైకిల్‌కు అంతరాయం**

**30 శాతం వ్యాధినిరోధక వ్యవస్థ తగ్గుదల**

**సరైన పంథా, వ్యూహాలతో కోపాన్ని నియంత్రించ వచ్చంటున్న నిపుణులు**



హైదరాబాద్:భావోద్వేగాల పరంగా చూస్తే.. ఆయా సందర్భాలు, సంఘటనలను బట్టి కోపం రావడాన్ని సహజ లక్షణంగానే పరిగణిస్తుంటారు. కానీ కోపాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైతే మాత్రం.. దాని పర్యవసనాలు తీవ్రంగా ఉంటున్నాయనేది అనేక ఘటనలు రుజువు చేస్తున్నాయి. ఎవరైనా తమ కోపాన్ని ఆపుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటే.. దాని ప్రతికూల ప్రభావం వారి ఆరోగ్యంపై పడుతోందని స్పష్టమౌతోంది. ఆగ్రహాన్ని ఆపుకోలేకపోతే వివిధ రూపాల్లో ఆరోగ్యంపై ప్రభావంపడడంతో పాటు, ఏదైనా ధ్వంసం చేయాలనే ఆలోచన లేదా ఎవరిపై దాడికి పాల్పడటం, స్వీయ నియంత్రణ కోల్పోవడం, తదితర రుగ్మతలకు దారితీయడం, వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బ తినడానికి కారణమౌతున్నట్టు నిపుణులు అంచనా వేస్తున్నారు. చిన్నచిన్న విషయాలకే కోపం రావడం వంటివి దీర్ఘకాలం కొనసాగితే.. వ్యక్తిగతంగా ఆరోగ్యంపై, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి.. అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోనాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు. ట్రాఫిక్‌లో ఇరుక్కుని వెళ్లాల్సిన ముఖ్యమైన సమావేశానికి లేదా ఫంక్షన్‌కు ఆలస్యం కావడం, చిన్న విషయానికే చిరాకు పడటం, అపరాధ భావం, కొందరిపై లేదా పరిస్థితులపై వ్యతిరేక భావం, ఏదైనా విషయమై తోటివారు, స్నేహితులు, బంధువులు, సహచరులతో భిన్నాభిప్రాయాలు ఎదురుకావడం, మానసికంగా కుంగుబాటు, కూడా కోపం రావడానికి కారణాలుగా విశ్లేషిస్తున్నారు. పలు ప్రతిష్టాత్మక సంస్థలు నిర్వహించిన అధ్యయనాల్లోనూ కోపం వల్ల ఆరోగ్యంపై పడే ప్రభావం, ఇతర అంశాలను పరిశీలించారు. కోపోద్రిక్తులు కావడం వల్ల వెంటనే గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. రక్తపోటు పెరగడం వల్ల గుండెపై (కార్డియోవాస్క్యులర్ (స్ట్రెయిన్) ఎక్కువ ఒత్తిడి పెరుగుతుంది. గుండెజబ్బుల ముప్పు కూడా 19 శాతం పెరుగుతుందని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ తన పరిశీలనలో పేర్కొంది. ఏదైనా సంఘటన లేదా కారణంతో అధికంగా ఉద్రేక పడితే.. ఆ తర్వాత రెండుగంటల వ్యవధిలోనే గుండెపోటు వచ్చే అవకాశం ఎనిమిదన్నర రెట్లు పెరుగుతుందని యూరోపియన్ హార్ట్ జనరల్ వెల్లడించింది. రక్తపోటు పెరిగిపోయి 'క్రానిక్ హైపర్‌టెన్షన్'గా మారితే హార్ట్‌స్ట్రోక్‌తో పాటు మూత్రపిండాల వ్యాధులకు దారితీయొచ్చని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కోపంపై నియంత్రణ కోల్పోతే రోగనిరోధక సామర్థ్యం 30 శాతం తగ్గిపోతుందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కోపానికి గురైనపుడు కొన్ని గంటల పాటు రోగనిరోధక వ్యవస్థ బలహీనమౌతుందని వెల్లడిస్తున్నాయి. 24 గంటల పాటు 'స్లీప్ సైకిల్స్'లో ఇబ్బందులు, కేవలం రెండు నిమిషాల కోపం అనేది 7 గంటల పాటు 'కోర్టిసోల్'స్థాయిల్లో పెరుగుదలకు కారణమౌతుందని హెచ్చరిస్తున్నాయి.

### ఆగ్రహం నియంత్రణకు ఏం చేయాలంటే..

కోపం వచ్చే సూచనలను ముందుగానే గమనించి.. దాని నియంత్రణకు అవసరమైన విధంగా స్పందించాలి వెంటనే ప్రతిస్పందించకుండా.. ఏం చేయాలనే దానిపై కొంత సమయమిచ్చి ఆలోచించాలి. ఒకటి నుంచి పది దాకా లెక్క పెట్టడంతో పాటు కామింగ్ బ్రీథింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి కోపానికి కారణం ఏమిటో తెలియజేయాలి. అందుకు కారణమైన వ్యక్తితో కాకుండా మిత్రుడు లేదా ఆప్తులతో మాట్లాడాలి పరుగు, నడక, ఈత, యోగ వంటి ఒత్తిళ్లను తగ్గించే కార్యకలాపాలు చేయాలి ఏదైనా సంఘటనకు వెంటనే ప్రభావితమై స్పందించకుండా.. ఏం చేయాలన్న దానిపై దృష్టి పెట్టాలి.

### యాంగర్ మేనేజ్‌మెంట్ కేసులే ఎక్కువ

మా దగ్గరకు 'యాంగర్ మేనేజ్‌మెంట్'కు సంబంధించిన కేసులు ఎక్కువగానే వస్తున్నాయి. వైవాహిక బంధంలో తలెత్తే సమస్యలతో దంపతులిద్దరిలో ఎవరో ఒకరు కోపోద్రిక్తులు కావడం, రోడ్డుపై వెళుతున్నపుడు ఎదురయ్యే ఘటనలతో, వ్యక్తిత్వాల్లో వచ్చిన మార్పులతో ఆవేశాలు, ఇలా వివిధ కారణాలు, సంఘటనలతో ప్రభావితమై తమ ఆగ్రహాన్ని నియంత్రించుకోలేని వారు వస్తున్నారు. వారికి ఆయా సమస్యలకు అనుగుణంగా మందులు ఇవ్వడం, కౌన్సెలింగ్, యాంగర్ మేనేజ్‌మెంట్ క్లాసెస్ తీసుకుంటున్నాం. అప్పుడప్పుడు ఏదైనా సందర్భంలో లేదా ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు ఆగ్రహానికి గురైతే మంచిదే. కానీ ఏ చిన్న సంఘటనకైనా, చిన్నపాటి వాగ్వాదానికి ఇతరులపై కోపగించుకోవడం, రుస రుసలాడటం వంటివి చేస్తే మాత్రం ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. కోపం అనేది 'నెగిటివ్ ఎమోషన్'అయినప్పటికీ.. ఆగ్రహం రావడానికి భావోద్వేగపరమైన అంశాలు మెదడుపై ప్రభావం చూపి (నెర్వస్ సిస్టమ్‌పై) శరీరంలోని అన్ని భాగాలను ప్రభావితం చేసి ఒక్కసారిగా రక్తప్రసారం పెరిగిపోతుంది. వెంటనే ఏదో రూపంలో శరీరం స్పందించేలా చేస్తుంది. మామూలుగా చూస్తే ఇదొక రక్షణ వ్యవస్థ (డిఫెన్స్ మెకానిజం)గా ఉన్నా.. ఒకస్థాయి దాటాక కోపాన్ని నియంత్రించుకోలేకపోతే దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుంది. అందువల్ల కోపంపై నియంత్రణ ఎంతైన అవసరం.

### చేయకూడనివి..

అన్నింటినీ ఒకేసారి చేయా లని ప్రయత్నించొద్దు. అందుకోగలిగే చిన్న లక్ష్యాలను ముందు నిర్దేశించుకోవాలి

మనం మార్చలేని వాటిపై దృష్టి కేంద్రీకరించొద్దు. సమయాన్ని, శక్తియుక్తులను నిర్దేశిత లక్ష్యంపై పెట్టాలి. ఎవరికి వారు స్వాంతన చేకూర్చుకుంటే మంచిది ఏకాకిగా ఉన్నాననే భావన రానివ్వొద్దు. మిత్రులు, సహచరుల సహకారం, మద్దతు తీసుకోవాలి కోపాన్ని తగ్గించుకునేందుకు మద్యం, సిగరెట్, గ్యాంబ్లింగ్, డ్రగ్స్ వంటి వాటిని ఎప్పటికీ ఆశ్రయించవద్దు. ఇవన్నీ కూడా మానసికంగా మరింతగా క్షీణించేలా చేస్తాయి.

# ఏటా 10 వేల మెడికల్ సీట్లు పెంపు

**5 ఏళ్లలో 75 వేల సీట్లు**

**కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటన**

**అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు**

**ఈ సంవత్సరంలో 200 సెంటర్లు**

**కేన్సర్, దీర్ఘకాల రోగాల ఔషధాల చికిత్సకు వాడే 36 మందులపై కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు**

**ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.99,858.56 కోట్ల కేటాయింపు**



న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు ఈసారి బడ్జెట్‌లో రూ.99,858.56 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ.89,974.12 కోట్లు కేటాయించగా, ఈసారి 11 శాతం మేర పెంచినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అలాగే దేశంలో వచ్చే ఏడాది నుంచి మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల్లో అదనంగా పదివేల సీట్లను పెంచనున్నట్లు తెలిపారు. ఈ పెంచిన సీట్ల ద్వారా వైద్య విద్యను అభ్యసించాలనుకునే వారి కల సాకారమైనట్లేనన్నారు. కాలేజీల్లో మెడికల్ సీట్ల కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు మెడికల్ సీటు రాక.. మరో ఏడాదిపాటు వేచి ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు ఏడాదికి 10 వేల సీట్ల చొప్పున ఐదేళ్లలో 75 వేల సీట్లు పెంచుతున్నట్లు శనివారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2025%-%26 వార్షిక బడ్జెట్‌లో ప్రకటించారు. తమ ప్రభుత్వం గత పదేళ్లలో 1.1 లక్షల అండర్ గ్రాడ్యుయేట్, పీజీ మెడికల్ సీట్లను అందుబాటులోకి తెచ్చిందన్నారు.

### జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లు

ఇటీవల కాలంలో కేన్సర్ బారిన పడుతూ ఎంతోమంది రోగులు ఆసుపత్రుల్లో బారులుతీరుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన కేంద్రం.. ఆ రోగులకు ఉపశమనం కలిగించేందుకు మరో అడుగు ముందుకేసింది. ఇందులోభాగంగా దేశవ్యాప్తంగా డే కేర్ కేన్సర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వచ్చే మూడేళ్లలో దేశంలోని అన్ని జిల్లా ఆసుపత్రుల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. 2025%-%26లో సుమారు 200 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### కేటాయింపులు ఇలా...

వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు మొత్తం రూ.99,858.56 కోట్లను కేటాయించగా, ఇందులో వైద్య, కుటుంబ సంక్షేమ విభాగానికి రూ.95,957 కోట్లు, ఆరోగ్య పరిశోధనల విభాగానికి రూ.3,900.69 కోట్లు కేటాయించారు. 'ఆయుష్ మంత్రిత్వ శాఖకు రూ.3,992.90 కోట్ల కేటాయింపు. గత బడ్జెట్‌లో రూ.3,497 కోట్లను కేటాయించారు.. ఇప్పుడు 14.15 శాతం పెంపు. ' జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.37,226.92 కోట్ల కేటాయింపు. గత బడ్జెట్‌లో రూ.36,000 కోట్లు. ' ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజనకు (ఏబీపీఎం-జేఏవై) రూ.9,406 కోట్లు. ' స్వయంప్రతిపత్తి గల సంస్థలకు రూ.20,046.07 కోట్లు కేటాయించారు. 2024-25లో రూ.18,978.72 కోట్లు కేటాయించారు.

### 36 మందులకు సుంకం మినహాయింపు

' కేన్సర్, అరుదైన వ్యాధులు, ఇతర దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఉపశమనం అందించేందుకు వారు వాడే మందులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ (బీసీడీ)ని పూర్తిగా మినహాయించను న్నారు. వారు చికిత్సకు వినియోగించే 36 రకాల జీవ ఔషధాలపై ఈ మినహాయింపు వర్తిస్తుందని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అలాగే, ఫార్మాకంపెనీలు పేషెంట్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్స్ కింద రోగులకు అందించే మరో 37 రకాల మందులతోపాటు 13 కొత్త ఔషధాలకు బీసీడీని మినహాయించనున్నారు. దీంతో ఆయా మందులను రోగులను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ' ప్రైవేట్ రంగం భాగస్వామ్యంతో దేశంలో మెడికల్ టూరిజం, 'హీల్ ఇన్ ఇండియా'ను ప్రోత్సహించడంతోపాటు, సులభతర వీసా విధానాన్ని తెస్తామని చెప్పారు. ' ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ప్రభుత్వ మాధ్యమిక స్కూళ్లకు బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందుబాటులోకి తెస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

### మెరుగైన ఆరోగ్య జీవితం కోసం...

ఈ బడ్జెట్ మెరుగైన ఆరోగ్య జీవితాన్ని అందించేందుకు దోహదపడుతుంది. దేశంలో 200 డేకేర్ కేన్సర్ సెంటర్ల ఏర్పాటు, కేన్సర్, దీర్ఘకాల వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మందులపై కస్టమ్స్ డ్యూటీని మినహాయించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ చర్యలు సంక్రమణేతర వ్యాధులపై పోరాటానికి, రోగుల జేబులపై భారం తగ్గించేందుకు దోహదపడతాయి. కొత్త విద్యావకాశాలతోపాటు ఉపాధి కల్పనకు కూడా ఈ బడ్జెట్ ఊతమిస్తుంది.

## రాష్ట్రపతి ప్రసంగంపై అనుచిత వ్యాఖ్యలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలపై క్రిమినల్ కేసు నమోదు



ముజఫర్‌పూర్ : రాష్ట్రపతి ప్రసంగంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలపై ముజఫర్‌పూర్ సిజెఎం (చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్) కోర్టులో ఫిర్యాదు నమోదైంది. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం పార్లమెంటు వెలుపల.. ఆమె ప్రసంగం బాగోలేదని చెప్పడం సరికాదని, కాంగ్రెస్ నేతలు ద్రౌపది ముర్మును అవమానించేందుకు ప్రయత్నించారని సదర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లఖ్లోద్‌పూర్ పటాహి నివాసి ముజఫ్ఫాపూర్‌కి చెందిన ప్రముఖ న్యాయవాది సుధీర్ కుమార్ ఝా కోర్టులో ఫిర్యాదు చేశారు. భారత న్యాయ సంహిత 2023లోని 352, 351(2) (3) 79, 151 61(2) కింద వీరిపై కేసు నమోదైంది. ఆరోపణలు రుజువైతే.. నిందితులకు రెండు నుంచి ఏడేళ్ల వరకు జైలు పడే అవకాశం ఉందని సుధీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక వాద్రాలపై నేను ముజఫర్‌పూర్ కోర్టులో క్రిమినల్ కేసు పెట్టాను. పార్లమెంటులో ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బడ్జెట్‌పై ప్రసంగించారు. ఆమె ప్రసంగాన్ని కుట్రపూరితంగానే వీరు అనుచిత, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి ఓ గిరిజన మహిళ. అలాంటి మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. అందుకే ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కోర్టులో పిటిషన్ వేశాను' అని అన్నారు. ఈ పిటిషన్ ఫిబ్రవరి 10వ తేదీన కోర్టు విచారించనుంది. కాగా, జనవరి 31వ తేదీన పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మొదటగా ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగంపై పార్లమెంటు వెలుపల మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ 'రాష్ట్రపతి ప్రసంగం పేలవంగా ఉంది. చివరి వరకు ఆమె మాట్లాడలేక అలసిపోయింది' అని అన్నారు. ఆ తర్వాత రాహుల్ గాంధీ తల్లి మాటలకు మద్దతిస్తూ.. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉంది. చెప్పిన విషయాన్నే పదే పదే చెప్పారు అని అన్నారు. ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా కేసు నమోదైంది.

## వక్ఫ్ బిల్లు నివేదికను సోమవారం లోక్‌సభకు సమర్పించనున్న జెపిసి



న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 నివేదికను జెపిసి (జాయింట్ పార్లమెంటరీ కమిటీ) కమిటీ సోమవారం (ఫిబ్రవరి 3) లోక్‌సభకు సమర్పించనుంది. ఈ వక్ఫ్‌బిల్లును ఎన్‌డిఎ సభ్యులు ఏకపక్షంగా ఆమోదించుకున్నారని ప్రతిపక్ష ఎంపీలు మండిపడుతున్నారు. ఈ కమిటీలో సభ్యుడైన కాంగ్రెస్ ఎంపి సయ్యద్ నసీర్ హుస్సేన్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. 'ఈ కమిటీలో నేను కూడా సభ్యుడిగా ఉన్నాను. ఈ బిల్లును నేను వ్యతిరేకిస్తూ వివరణాత్మక నోట్‌ను కమిటీకి సమర్పించాను. ఛ్చిన అయితే ఆశ్చర్యకరంగా నేనినోట్‌లోని కొన్ని భాగాలు నాకు తెలియకుండానే సవరించారు' అని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాగా, ఈ బిల్లుకు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన 44 సవరణల్ని జెపిసి కమిటీ తిరస్కరించింది. ఈ కమిటీలో ఎన్‌డిఎ సభ్యులు ప్రతిపాదించిన 14 సవరణల్ని ఆమోదించింది. ఈ సవరణలకు ఎన్‌డిఎ సభ్యులు 16 మంది మద్దతు తెలిపారు. ప్రతిపక్షానికి చెందిన 10 మంది వ్యతిరేకించారు.

## ఈసికి లేఖ రాసిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : తమ పార్టీ కార్యకర్తలపై బిజెపి దాడి చేసిందంటూ ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఎన్నికల సంఘం (ఈసి)కి ఆదివారం లేఖ రాశారు. తన నియోజకవర్గంలో స్వతంత్ర పరిశీలకులను నియమించాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన బిజెపి కార్యకర్తలను అరెస్ట్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. తన న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆప్ కార్యకర్తలపై జరిగిన కొన్ని ఘటలను కూడా లేఖలో ఉదహరించారు. శనివారం రోహిణి ప్రాంతంలో జరిగిన బహిరంగ ర్యాలీలో ఆప్ ఎమ్మెల్యే మొహిందర్ గోయల్‌పై దాడి జరిగినట్లు తెలిపారు. సెక్టార్ 2లోని పాకెట్ హెచ్‌లో స్థానికులతో గోయల్ సంభాషిస్తుండగా ఈ ఘటన జరిగింది. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆప్ కార్యకర్తలపై బిజెపి కార్యకర్తలు దాడి చేశారని, ప్రచారం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్ కూడా శనివారం ఈసికి లేఖ రాసిన సంగతి తెలిసిందే. 70 సీట్లు కలిగిన ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఓటింగ్ జరగనుంది. ఫిబ్రవరి8న ఫలితాలు వెలువడనున్నాయి. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఆప్ అభ్యర్థి కేజ్రీవాల్‌పై బిజెపి నుండి పర్వేష్ వర్మ, కాంగ్రెస్ నుండి సందీప్ దీక్షిత్‌లు పోటీ పడుతున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్..

### 8 మంది మావోయిస్టులు మృతి



బీజాపూర్ : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై ఉక్కుపాదం కొనసాగుతోంది. బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు మరణించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని గంగలూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వెస్ట్ బస్తర్ డివిజన్‌కు చెందిన మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో భద్రతా దళాలు అక్కడ గాలింపు చర్యలు ప్రారంభించాయి. డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్, కోబ్రా యూనిట్, ఎస్‌టిఎఫ్ బలగాలు సం యుక్తంగా ఈ గాలింపు చర్యల్లో పాల్గొన్నాయి. వీరిని చూసిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. దీంతో భద్రతా సిబ్బంది కూడా ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఉదయం 8:30 గంటలకు ప్రారంభమైన ఈ ఎన్‌కౌంటర్ రాత్రి తరువాత కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. అడవుల్లో ఉన్న మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతోందని తెలిపారు. ఘటనా స్థలంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే.

# వృద్ధి సాధనకు ఊతం ఏదీ?



ప్రపంచవ్యాప్తంగా చాలామేరకు ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నా, ఉపాధి కల్పన మెరుగ్గా కనబడు తున్నా వాణిజ్య వ్యవహారాల్లో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, దేశాల మధ్య పెరుగుతున్న పోటీ ఒక రకమైన అనిశ్చిత వాతావరణానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఆర్థిక సర్వే విడుదల చేసింది. పరస్పర ఆధారిత వర్తమాన ప్రపంచంలో ఏ దేశమూ సమస్యలనూ, సంక్షోభాలనూ తప్పించుకోలేదు. అలాగే వాటి పరిష్కారానికి సాగే కృషిలో భాగస్వామి కాకుండా ఒంట రిగా దేన్నీ అధిగమించలేదు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు ముందుంచిన ఆర్థిక సర్వే దీన్నంతటినీ ప్రతిబింబించింది. మనది ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి. ఇతర దేశాలతో పోలిస్తే మనది చురుకైన ఆర్థిక వ్యవస్థే. కానీ ఇటీవలి కాలంలో అది కొంత మంద గమనంతో కదులుతోంది. 2023లో 8.2 శాతంగా ఉన్న వృద్ధి రేటు నిరుడు 6.5 శాతానికి క్షీణించింది. ఇది 2026 వరకూ ఈ స్థాయిలోనే వుంటుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) ఈ నెల 17న అంచనా వేసింది. పట్టణ ప్రాంత వినియోగంలో క్షీణత, ఆహార పదార్థాల ధరల్లో పెరుగుదల, వేతన స్తంభన, అంతంతమాత్రంగా ఉన్న ఉపాధి కల్పన, ప్రైవేటు రంగ పెట్టుబడుల మందకొడితనం స్పష్టంగా కనబడుతోంది. ఒక్క కర్ణాటక, మహారాష్ట్రల్లో మాత్రమే వినియోగిత పెరి గింది. ఆంధ్రప్రదేశ్‌లో అంతక్రితం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెరుగ్గా ఉన్న వినియో గిత ఎన్డీయే సర్కారు వచ్చాక క్షీణించింది. 'మొత్తంమీద ద్రవ్యోల్బణం అదుపులోనే ఉన్నా ఆహార పదార్థాల ధరలు ఇప్పటికీ అధికంగానే ఉన్నాయ'ని సర్వే అంగీకరించింది. గత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం ఉండగా, అదిప్పుడు 4.9 శాతానికి చేరుకుంది. ఆహారేతర, ఇంధనేతర సరుకుల ధరల తగ్గుదల ఇందుకు కారణం. వాస్తవానికి పంపిణీ మెరుగుకావటం, వాతావరణం అనుకూలించటం వంటి కారణాల వల్ల చాలా దేశాల్లో ఆహార సరుకుల ధరలు తగ్గాయి. మన దేశమూ, చైనా, బ్రెజిల్ వంటి దేశాల్లో ఇందుకు భిన్నమైన పోకడ కనబడుతోంది. నిరుడు 7.5 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం ప్రస్తుతం 8.4 శాతానికి చేరుకుంది. పంపిణీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా కూరగాయలు, పప్పులు వగైరా ధరల్లో పెరుగుదల నమోదవుతున్నదని నిపుణుల అభిప్రాయం. రాగల రోజుల్లో కూరగాయల ధరలు తగ్గుతాయని, ఖరీఫ్ పంటలు మార్కెట్లో అడుగుపెడితే ఇతర ధరలు కూడా సర్దుకుంటాయని సర్వే ఆశాభావం వ్యక్తం చేస్తున్నా అదంతా ప్రపంచ స్థితిగతులపై ఆధారపడి వుంటుంది. ముమ్ముందు ప్రపంచ సాగుపంటల ధర వరలు పెరుగుతాయని, వాతావరణ మార్పులు కూడా అనుకూలించకపోవచ్చని అంచనాలు న్నాయి. అదనంగా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉండనే ఉన్నాయి. ఎదగదల్చుకున్నవారికి ఆశావహ దృక్పథం అవసరం. స్వాతంత్ర్యం వచ్చి 2047కి వందేళ్లవు తాయి కాబట్టి అప్పటికల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకోవాలని ఎన్డీయే సర్కారు కోరుకుంటోంది. కానీ వరసగా రెండు దశాబ్దాలపాటు 8 శాతం నిలకడైన జీడీపీ కొనసాగితేనే ఇది సాధ్యం. ప్రస్తుత జీడీపీలో పెట్టుబడుల వాటా 31 శాతం. దీన్ని కనీసం 35 శాతానికి తీసుకెళ్లాలి. ముఖ్యంగా తయారీరంగం వృద్ధి చెందాలి. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, బయోటెక్నాలజీరంగాల్లో విస్తరిస్తున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలి. ఇవన్నీ జరిగితేనే 'వికసిత్ భారత్' సాకారమవుతుంది. అందుకు భూసంస్కరణలు, కార్మికరంగ సంస్కరణలు అత్యవసరం అంటు న్నది ఆర్థిక సర్వే. కానీ కార్మిక రంగ సంస్కరణలను ట్రేడ్ యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నాయి. బ్రిటిష్ వలస పాలకుల కాలంనుంచి ఇంతవరకూ పోరాడి సాధించుకున్న అనేక హక్కుల్ని లేబర్ కోడ్ హరిస్తున్నదని వాటి ఆరోపణ. ముఖ్యంగా ట్రేడ్ యూనియన్ల ఏర్పాటును కష్టతరం చేయటం, ఇప్పటికేవున్న ట్రేడ్ యూనియన్ల గుర్తింపు రద్దుకు వీలు కల్పించటం, సమ్మె హక్కును కాలరాయటం, మధ్యవర్తిత్వ ప్రక్రియకు ప్రతిబంధకాలు ఏర్పర్చటం, లేబర్ కోర్టుల మూసివేత, ట్రిబ్యునల్ ఏర్పాటు వంటివి ఉన్నాయంటున్నారు. వీటిపై కార్మిక సంఘాలతో చర్చించటం, పార దర్శకత పాటించటం, అవసరమైన మార్పులకు సిద్ధపడటం వంటి చర్యలద్వారా అపోహలు తొల గించటానికి కేంద్రం కృషి చేస్తే కార్మిక రంగ సంస్కరణల అమలు సాఫీగా సాగిపోతుంది. ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చటానికి సంస్కరణలు అవసరం అనుకున్నప్పుడు ఇదంతా తప్పనిసరి. వాస్తవాలను గమనంలోకి తీసుకుని జాగురూకతతో అడుగులేయకపోతే లక్ష్యసాధన కష్ట మవుతుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం నిరుడు లిస్టెడ్ కంపెనీల లాభార్జన22.3 శాతం పెరిగింది. చెప్పాలంటే ఆర్థిక, ఇంధన, ఆటోమొబైల్ రంగాల కార్పొరేట్ సంస్థలకు లాభాలు వచ్చిపడ్డాయి. కానీ ఆ రంగాల్లో ఉపాధి కల్పన పెరిగింది లేదు. వేతనాలు స్తంభించాయి. పరిస్థితులిలా వుంటే వినియోగిత పెరుగుతుందా? తగినంత డిమాండ్ లేనప్పుడు తయారీరంగంలో పెట్టుబడుల వృద్ధి సాధ్యమవుతుందా? ఈ వ్యత్యాసాలపై దృష్టి పెట్టనంతకాలమూ ఆర్థిక రంగ స్వస్థత సులభం కాదు. వృద్ధికి ఊతం ఇచ్చేందుకు వీలుగా రుణాల వడ్డీ రేట్లు తగ్గించాలని రిజర్వ్‌బ్యాంకును నిర్మలా సీతారామన్‌తోపాటు కేంద్ర వాణిజ్యమంత్రి పీయుష్ గోయల్ కూడా కోరుతున్నారు. మంచిదే. తమవంతుగా ఉద్యోగకల్పన, వేతనాల పెంపుపై కూడాకేంద్రం దృష్టి సారించాలి. శనివారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో అందుకు తగిన ప్రతిపాదనలుంటాయని ఆశిద్దాం.

# ప్రైవేటు స్కూళ్లలో 'ఉచిత'మెప్పుడు?

**విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు ఉచితం**
**పేదలు, వికలాంగులు, అనాథలకు ఇవ్వాలని నిబంధన**
**వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని హైకోర్టుకు తెలిపిన సర్కారు**
**అధ్యయనం చేస్తున్నామంటున్న విద్యాశాఖ**
**ఫీజు రీయింబర్స్ చేస్తే సీట్లిస్తామంటున్న ప్రైవేటు స్కూళ్లు**



హైదరాబాద్: ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలన్న చట్ట నిబంధన అమలుపై సందిగ్ధత నెలకొంది. విద్యా హక్కు చట్టంలోని ఈ నిబంధన అమలుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపినప్పటికీ.. అందుకోసం ఇంకా కార్యాచరణ ప్రణాళిక మాత్రం రూపొందించలేదు. దీనిని ఎలా అమలు చేయాలనే అంశంపై అధ్యయనం చేస్తున్నామని విద్యాశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరోవైపు కొన్ని కార్పొరేట్ స్కూళ్లు వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు మొదలు పెట్టాయి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లల్లో అడ్మిషన్లు ముగింపు దశకు చేరాయి. 25 శాతం ఉచితంపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఆ సంస్థలు అంటున్నాయి. ప్రభుత్వం ఫీజులను రీయింబర్స్ చేస్తే పేదలకు ఉచితంగా సీట్లు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి.

### ఎవరికి ఉచితం?

రాష్ట్రంలో దాదాపు 10 వేలకుపైగా ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం అనాథలు, వికలాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 4, బీసీ, మైనార్టీ, అల్పాదాయ వర్గాల పిల్లలకు 6 శాతం కలిపి మొత్తం 25 శాతం సీట్లను ఉచితంగా ఇవ్వాలి. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధన అమలు తీరును విద్యాశాఖ పర్యవేక్షించాలి. స్థాయిని బట్టి ప్రైవేటు స్కూళ్లలో ప్రస్తుతం రూ.40 వేల నుంచి రూ.20 లక్షల వరకు వార్షిక ఫీజు వసూలు చేస్తున్నారు. రూ.40 వేల లోపు ఫీజులుండే ప్రైవేటు స్కూళ్లల్లో ఆశించిన మేర అడ్మిషన్లు జరగవు. కాబట్టి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేస్తే ఈ పథకం అమలుకు సిద్ధమేనని చెబుతున్నారు. కార్పొరేట్ స్కూళ్లు మాత్రం రూ.20 లక్షల ఫీజు లావాదేవీలను రికార్డుల్లో చూపించకుండా, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజుగా వసూలు చేస్తున్నాయి. వీటికి ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదు. ఉచిత సీట్లిస్తే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేసినా ట్యూషన్ ఫీజుగా వసూలు చేసే రూ.2 లక్షల లోపే వస్తుందని ఆ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర సిలబస్‌తో నడిచే సీబీఎస్సీ, ఐసీఎస్ఈ వంటి స్కూళ్లపై రాష్ట్రానికి అంతగా ఆధిపత్యం ఉండదని అధికారులు అంటున్నారు.

### కొన్ని రాష్ట్రాల్లో అమలు

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, తెలంగాణ, మరో మూడు రాష్ట్రాల్లో మాత్రమే 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు అమలు జరగడం లేదని అధికారులు తెలిపారు. మిగతా రాష్ట్రాల్లో ఈ పథకం వివిధ మార్గాల్లో అమలవుతోంది. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ చేస్తోంది. మరికొన్ని రాష్ట్రాల్లో ప్రైవేటు స్కూళ్లే స్వచ్ఛందంగా అమలు చేస్తున్నాయి. కాగా, విద్యాహక్కు చట్టం ప్రకారం ఆవాసాలకు కిలోమీటర్ దూరంలో ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నతపాఠశాల లేకపోతే ఆయా విద్యార్థులకు ప్రైవేట్ బడుల్లో 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉంటుందని కొన్ని ప్రైవేటు స్కూళ్లు వాదిస్తున్నాయి. అయితే, ఈ నిబంధనతో పనిలేదని విద్యాశాఖ చెబుతోంది. పథకం అమలుపై ఇటీవల ప్రభుత్వం నివేదిక కోరడంతో అధికారులు సమర్పించారు. 38 లక్షల్లో 25 శాతం మందికి ఉచితంగా సీట్లిస్తే దాదాపు 9 లక్షల మందికిపైగా విద్యార్థులు సీట్లు పొందుతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తే ఈ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించాలి. ఇది ఆర్థికంగా గుదిబండ అవుతుందనే భావనతో ప్రభుత్వం ఉన్నదని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఫీజు రీయింబర్స్ చేయకుండా, ప్రైవేటు స్కూళ్లు సామాజిక బాధ్యతగా 25 శాతం ఉచితం అమలు చేసేలా చూడాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

# కేంద్ర బడ్జెట్‌పై సీఎం రేవంత్ అసంతృప్తి!

**రాష్ట్రం పెట్టిన ప్రతిపాదనలు, బడ్జెట్ కేటాయింపులపై ఆర్థికశాఖ అధికారులతో సమీక్ష**
**సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు**
**బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై లేఖ రాసే యోచన**
**రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనపైనా చర్చ**



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. రాష్ట్రానికి ఆర్థిక సాయం అందించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర మంత్రులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. శనివారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా రాష్ట్రం నుంచి కేంద్రానికి చేసిన ప్రతిపాదనలు, బడ్జెట్‌లో కేంద్రం చేసిన కేటాయింపులపై ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సీఎంతో పాటు మంత్రులకు వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు ఏమీ లేవని, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లు, సీఎస్ఎస్ పథకాల ద్వారా నిధులు, అన్ని రాష్ట్రాలతోపాటు మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా వచ్చే నిధులు మాత్రమే కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రానికి వస్తాయని ఆయన వివరించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసే అంశాన్ని పరిశీలించాలని సీఎం కోరినట్టు సమాచారం. రాష్ట్రానికి ఏ ఒక్క పథకానికి నిధులు ప్రత్యేకంగా లేని అంశంపై పార్లమెంట్ సభ్యులు లోక్‌సభలో గట్టిగా నిలదీసే అంశాన్ని కూడా చర్చించినట్టు తెలిసింది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టుకు నిధులు సమకూరేలా చర్యలు తీసుకోకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి తన అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. సమావేశాలు ముగిసేలోగా రాష్ట్రానికి న్యాయం జరిగేలా లోక్‌సభలో ఎంపీలు పోరాటం సాగించాలన్న అభిప్రాయాన్ని సీఎం వ్యక్తం చేశారంటున్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రానికి లేఖ రాసే అంశాన్ని కూడా పరిశీలించినట్టు తెలిసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలు, ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఖర్చుల వివరాలను కూడా సీఎం, మంత్రులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర బడ్జెట్‌ను వాస్తవానికి అనుగుణంగా తయారు చేయాలని, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా తయారు చేయాలని సీఎం ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు.